
ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి



కడప
జిల్లా వార్తలు

5

బుధవారం 20 నవంబరు 2024

అదానీ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న కూటమి నేతలు



హైడ్రోపవర్ ప్లాంట్ పనుల వద్ద ఉద్రిక్తత

- అధికార కూటమి ఎంపీకి పనుల కేటాయింపుతో..
- జమ్మలమడుగు కూటమి నేతల ఆందోళన
- రాళ్లు రువ్వి అద్దాలు పగలగొట్టిన ఆందోళనకారులు

ప్రొద్దుటూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దొంతికోన సమీపంలో చేపట్టే హైడ్రోపవర్ ప్లాంట్ వద్ద మంగళవారం ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఆదానీ కంపెనీ ఈ ప్రాజెక్టుకు చెందిన పనులు చేపడుతుండగా సబ్ కాంట్రాక్ట్ పనులను జిల్లాకు చెంది న అధికార కూటమి ఎంపీకి ఇవ్వడంతో జమ్మలమడుగు కూటమి నేతలు ఫైర్ అయ్యారు. మా నియోజకవర్గంలో వారికి పనులు ఎలా ఇస్తారంటూ ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా కొంతమంది ఆందోళన కారులు క్యాంప్ వద్ద ఉన్న కంటైనర్, హిటాచీపై రాళ్లు రువ్వడంతో అద్దాలు పగిలినట్లు తెలుస్తోంది. హైడ్రోపవర్ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే సోదరుడు శివ నారాయణరెడ్డి, బీజేపీ యువమోర్చా నాయకుడు డాక్టర్ రాజేష్ రెడ్డితో కలిసి జమ్మలమడుగు నియోజకవర్గంలోని ఎన్డీఏ కూటమి నేతలు సుమారు 500 మంది వాహనాల్లో అక్కడకు చేరుకుని నిరసన వ్యక్తం చేశారు. స్థానికులకు ఉద్యోగ అవకాశాలు ఇవ్వకుండా ఇతర ప్రాంతాల వారికి ప్రాధాన్యత ఇస్తున్నారని మండిపడ్డారు. వెంటనే అర్హత ఉన్న స్థానిక నిరుద్యోగులకు కంపెనీలో అవకాశాలు కల్పించాలని కంపెనీ ప్రతినిధులను కోరారు. అలాగే స్థానిక నేతలకు చిన్న చిన్న పనులు కూడా ఇవ్వాలని లేకపోతే పనులు జరగనివ్వమని హెచ్చరించారు. కూటమి నేతలు భారీ ఎత్తున చేరు కోవడంతో జమ్మలమడుగు డీఎస్పీ వెంకటేశ్వరరావు చేరుకొని కంపెనీ ప్రతినిధులతో, కూటమి నేతలతో మాట్లాడారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కూటమినేతలకు సర్దిచెప్పారు. సీఐ మహమ్మద్ రఫి, తాళ్లప్రొద్దుటూరు ఎస్ఐతో పాటు పోలీసులు కార్యాలయం వద్ద బందోబస్తు నిర్వహిస్తున్నారు.

పెద్ద దర్గాను దర్శించుకున్న వైఎస్ షర్మిల



చాదర్‌ను తీసుకువస్తున్న షర్మిల

కడప కల్చరల్/వేంపల్లె, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కడప పెద్ద దర్గా ఉరుసు ఉత్సవాలను పురస్కరించుకుని మంగళవారం ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కుల, మతాలకతీతంగా రాష్ట్ర ప్రజలంతా సుఖ, శాంతులతో ఉండాలని ప్రార్థించానని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు విజయజ్యోతి, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు అఫ్జల్ ఖాన్, నియోజకవర్గాల సమన్వయ కర్తలు, నాయకులు పాల్గొన్నారు.

పేద బడుగుల ఆశా జ్యోతి ఇందిరమ్మ

దేశ ప్రజల సౌభాగ్యమే లక్ష్యంగా, దేశానికి ఎనలేని సేవలు చేసిన మహనీయురాలు దివంగత దేశ ప్రధాని ఇందిరమ్మ అని పీసీసీ అధ్యక్షురాలు షర్మిల కొనియాడారు. మంగళవారం మధ్యాహ్నం ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కాగా షర్మిల మంగళవారం రాత్రి 7.30 గంటలకు పులివెందుల నుంచి ఇడుపులపాయకు చేరుకున్నారు. రాత్రి అక్కడే బస చేయనున్నారు. బుధవారం కడపలో పర్యటించనున్నట్లు కాంగ్రెస్ పార్టీ వర్గాలు తెలిపాయి.

శబరిమలకు మరో ప్రత్యేక రైలు

కడప ఎడ్యుకేషన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): అయ్యప్పస్వామి భక్తుల సౌకర్యం కోసం దక్షిణ మధ్య రైల్వే మరో ప్రత్యేక రైలు వేసినట్లు కడప రైల్వే సీనియర్ కమర్షియల్ ఇన్‌స్పెక్టరు జనార్ధన్ తెలిపారు. మచిలీపట్నం నుంచి కొల్లంకు (07147) ప్రత్యేక రైలు డిసెంబరు 23, 30 తేదీల్లో ప్రయాణం అవుతుందన్నారు. అలాగే కొల్లం నుంచి మచిలీపట్నం (07148) రైలు డిసెంబరు 25, జనవరి 1 తేదీల్లో తిరుగు ప్రయాణం అవుతుందన్నారు. ఈ రైలు ఎర్రగుంట్ల, కడప, రాజంపేట స్టేషన్లలో హాల్ట్ ఉంటుందన్నారు. ఇప్పటికే దక్షిణ మధ్య రైల్వే శబరిమలైకి నాలుగు ప్రత్యేక రైళ్లు నడుపుతోందన్నారు. ఈ అవకాశాన్ని అయ్యప్ప భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నాడి పట్టుకుంటే.. ఒట్టు

- సర్కారు దవాఖానాల్లో అందని వైద్యం
- వేధిస్తున్న వైద్య సిబ్బంది కొరత
- ఉన్న వారిపైనే భారం
- వైద్యం అందక ప్రైవేటు ఆసుపత్రులకు పరుగు
- జనంపై అదనపు భారం



సింహాద్రిపురం ఆసుపత్రిలో ఒకే బెడ్‌పై ఇద్దరు రోగులు వైద్యం పొందుతున్న దృశ్యం

ఆంధ్రజ్యోతి విజిట్

కడప, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ పాలనలో వైద్య సేవలు మేడిపండు చూడు మేలిమై ఉండు, పొట్ట విప్పి చూడు పురుగులుండు అన్న చందంగా తయారయ్యిందంటారు. నిజమే.. ఎందుకంటే వైద్య ఆరోగ్యశాఖలో మార్పులు తెచ్చామని గొప్పలు చెప్పుకున్నారు. వీహెచ్‌సీల ద్వారా జనం వద్దకే సేవలంటూ చెప్పింది. అయితే సిబ్బం దిని వైద్య సిబ్బందిని నియమించకుండా చేతులెత్తేసింది. వెరసి ఇపుడు ఆ ఎఫెక్ట్ జనంపై పడుతోంది. సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. వైరల్ ఫీవర్, ఇతర సీజనల్ వ్యాధులు వస్తుండడంతో జనం ఆసుపత్రుల బాటపడుతున్నారు. ఇక ప్రైవేటు వైద్యం చాలా ఖరీదైంది. నాడి పట్టుకుంటే కనీసం రూ.400 వదులు కోవాల్సిందే. ఎక్స్‌రే, రక్త పరీక్షలు, టాబ్లెట్లు వామ్మో ఆసుపత్రులు అంటేనే భయపడే పరిస్థితికి వచ్చారు. జనం స్థానిక ఆసుపత్రులకు వెళితే వైద్యసిబ్బంది లేరు. దీంతో ఉన్న సిబ్బందిపై భారం పడుతోంది. అలాగే కొంతమంది వైద్యులు సమయపాలన పాటించకపోవడంతో రోగులు వేచి ఉండాల్సిన పరిస్థితి. ఉన్న వాళ్లలో కొందరు సెలవులపై వెళితే అక్కడ సేవలు అదడం లేదు. దీంతో జనం భారమైనా సరే ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లాల్సిన పరిస్థితి దాపురించింది. ఈ నేపథ్యంలో మంగళవారం జిల్లాలో ప్రభుత్వ ఆసుపత్రులపై ఆంధ్రజ్యోతి విజిట్ నిర్వహించగా.. వైద్యసిబ్బంది కొరత పుష్కలంగా కనిపించింది. మందులు కొరత లేనప్పటికి వైద్య సిబ్బంది లేకపోవడమే ప్రభావం చూపుతోంది. జిల్లాలో 51 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 30 అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లు, ఏడు సీహెచ్‌సీలు ఉన్నాయి. ఇక్కడ అందుతున్న వైద్యసేవలపై ఆంధ్రజ్యోతి ఆరా తీయగా..

పులివెందుల మండలంలోని నల్లపురెడ్డిపల్లె పీహెచ్‌సీలో ప్రతిరోజు ఓపీ సంఖ్య 50 నుంచి 60పైనే ఉంటుంది. ఆసుపత్రలో అన్ని వసతులు ఉన్నాయి. అయితే రాత్రిపూట వైద్యసేవలు అందడం లేదు. ఇద్దరు వైద్యులు ఉన్నప్పటికి ముగ్గురు స్టాఫ్‌నర్సులు ఉండాల్సి ఉండగా ఒకరు మాత్రమే విధులకు వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్ ఒకరోజు ఇక్కడ మరొక రోజు పులివెందుల బాకరాపురంలోని యూపీహెచ్‌సీలో విధులు నిర్వహిస్తున్నారు. షుగర్ ఇతర వైద్య పరీక్షల కోసం రోగులు వస్తే టెక్నీషియన్ లేకపోవడంతో రోగులు ఇబ్బంది పడుతున్నారు. క్షేత్రస్థాయి సిబ్బంది ఉన్నప్పటికి వారు గ్రామాలకు వెళ్లి జ్వరాల సర్వే చేయాల్సి ఉంది. అయితే కొందరు ఫీల్డ్‌కు వెళ్లకుండా ఉన్నట్లు చెబుతున్నారు. ఓ కాంట్రాక్టు స్టాఫ్‌నర్సు, సూపర్వైజర్‌ల వల్ల పీహెచ్‌సీకి చెడ్డపేరు వస్తోందన సిబ్బంది అంటున్నారు.

- చెన్నూరు సీహెచ్‌సీలో వైద్యసిబ్బంది కొరత ఉంది. ఆరుమంది స్టాఫ్‌నర్సులకు నలుగురే ఉన్నారు. వైద్యం కోసం చెన్నూరుతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు వస్తుంటారు. ఇక్కడ స్టాఫ్ కొరత కారణంగా వైద్యం అందకపోవడంతో కడపకు వెళ తున్నారు. 30 పడకల ఆసుపత్రి అయినప్పటికి అందు కు తగ్గ వసతులు లేవు. రెండేళ్లుగా ఎక్స్‌రే పనిచేయడం లేదు. ఆసుపత్రి ఆవరణలో పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగిపోవడంతో పాములు సంచరిస్తుంటాయి.
- కొండాపురం ప్రభుత్వాసుపత్రిలో ఒక డాక్టర్ మూడు రోజులు మాత్రమే విధులకు హాజరవుతారు. దీంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు.
- కమలాపురంలో 30 పడకల ఆసుపత్రి ఉంది. ఎక్స్‌రే మిషన్లు, జనరేటర్ పని చేయడం లేదు. రాత్రిపూట కరెంటు పోతే వైద్యసేవలకు ఇబ్బందిగా ఉంది. ప్రతి చిన్న సమస్యకూ కడప సర్వజన ఆసుపత్రికి రెఫర్ చేస్తుంటారు.
- చింతకొమ్మదిన్నె, కార్పొరేషన్ పరిధిలోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో ఉదయం 11 గంటలు అయిన వైద్యాధికారి ఆసుపత్రికి రాలేదు.
- మైలవరం పీహెచ్‌సీలో ఇద్దరు డాక్టర్లకు గాను ఒకరే ఉన్నారు.
- ముద్దనూరు ఆసుపత్రిలో ఇద్దరు ఉన్నారు. ఒకరు సెలవులో ఉండడంతో ఒకరు పనిచేస్తున్నారు.
- మైదుకూరు ఆసుపత్రిలో ఎక్స్‌రే లేదు. ఖాజీపేటలో ఇద్దరు డాక్టర్లకు గాను ఒక డాక్టర్ సెలవుపై వెళ్లారు.
- దువ్వూరులో డాక్టర్లు స్థానికంగా నివాసం లేరు. అత్యవసర సేవలకు ప్రొద్దుటూరు, కడప ప్రాంతాలకు వెళ్లాల్సిందే.
- పోరుమామిళ్ల ప్రభుత్వ ఆసుపత్రిలో 12 మంది వైద్యులు ఉండాల్సి ఉండగా ఇద్దరు గైనకాలజిస్టులు లాంగ్‌లీవ్‌లో ఉన్నారు. జనరల్ మెడిసన్, సర్జన్, అనస్థీషియతో పాటు ఒక స్టాఫ్‌నర్సు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. రోజూ 300 వరకు ఓపీ ఉంటుంది.
- అట్లూరు మండలంలో హెల్త్ సెంటర్లు ఉన్నాయి. స్థానికంగా సిబ్బంది నివాసం ఉండాల్సి ఉంది. ఇక్కడ ఎవరు ఉండడం లేదు.
- బద్వేలు ప్రభుత్వ ఆసుపత్రి ఈ ప్రాంతానికి పెద్దాసుపత్రి. 300 నుంచి 400 ఓపీ ఉంటుంది. 12మంది వైద్యులకు ఆరుగురు మాత్రమే ఉన్నారు. ఇద్దరు గైనకాలజిస్టులు, ఒక పిడియాట్రిక్, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జన్‌ల కొరత ఉంది. ఇక్కడ సిబ్బంది సరైన సమయపాలన పాటించలేదనే విమర్శ ఉంది. ఇక్కడ అల్ట్రాసౌండ్, ఎక్స్‌రే యంత్రాలు లేవు.



బద్వేలు ఆసుపత్రిలో వైద్యం కోసం వచ్చిన రోగులు



- సింహాద్రిపురం పీహెచ్‌సీ పరిధిలో సీజనల్ వ్యాధులు ప్రబలాయి. ఇక్కడ ఇద్దరు డాక్టర్లు ఉన్నప్పటికీ ఒకరు మాత్రమే హాజరయ్యారు. 60 ఓపీ సంఖ్య ఉంది. సీజనల్ వ్యాధులు రావడంతో రోగులకు సెలైన్లు ఎక్కించాల్సి ఉంటుంది. అయితే బెడ్ల కొరత కారణంగా అక్కడున్న బెంచీలపైనే సెలైన్ బాటిల్ ఎక్కించడం కనిపించింది.



- జమ్మలమడుగులోని మోరగుడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కొందరు వైద్యసిబ్బంది రోగుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తారంటారు. రోగులను పట్టించుకోకపోవడంతో ప్రైవేటు ఆసుపత్రులకు పరుగులు పెట్టాల్సి వస్తోంది. అదేవిధంగా రేడియాలజీ విభాగంలో సిబ్బంది ఎవరూ లేరు.

జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించాలి: కలెక్టర్

కడప కలెక్టరేట్ నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆకాంక్ష జిల్లాల ఆశయాలకు అనుగుణంగా జిల్లాను ప్రగతి పథంలో నడిపించాలని కలెక్టర్ శ్రీధర్ పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి ఆకాంక్ష జిల్లాల ఆశయ సాధనలో భాగంగా జిల్లాలో కార్యాచరణ, ప్రగతిపై సంబంధిత శాఖల జిల్లా అధికారులతో సమీక్ష చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ నీతి అయోగ్ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా కొన్ని ఆకాంక్ష జిల్లాలను ఎంపిక చేసిందని... అందులో వైఎస్ఆర్ జిల్లా ఉందన్నారు. సామాజిక స్థాయిని ఉన్నత స్థితికి తీసుకు రావడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమన్నారు. అందుకోసం సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో ముందుకు సాగాలన్నారు. డీఎండ్‌హెచ్‌ఓ డాక్టర్ నాగరాజు, డీఆర్డీఏ పీడీ ఆనంద్ నాయక్, ఐసీడీఎస్ అధికారి శ్రీలక్ష్మి, సీపీవో వెంకట్రావు, ఎల్‌డీఎం జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ వినీలాకాశంలో ధ్రువ కుమార్‌రెడ్డి

మ్యాచ్‌లో సెంచరీ కొట్టి అభివాదం చేస్తూ..



- పదేళ్ల వయసులోనే నేషనల్స్‌కు ఎంపిక
- అన్ని విభాగాల్లో 24 దఫాలు రాష్ట్రస్థాయి క్రీడాకారుడిగా గుర్తింపు
- నేడు పంజాబ్ కింగ్స్ నుంచి ట్రైల్స్‌కు పిలుపు
- క్రికెట్ అసోసియేషన్, తల్లిదండ్రులు, సన్నిహితుల సహాయంతో ముందుకెళతా..
- యువ క్రీడాకారుడు ధ్రువకుమార్‌రెడ్డి

(కడప-ఆంధ్రజ్యోతి): తొమ్మిదేళ్ల వయసులోనే క్రికెట్ బ్యాట్ చేతబట్టాడు. పది సంవత్సరాల వయసు వచ్చేసరికి అండర్-14 విభాగంలో నేషనల్స్‌కు ఎంపికయ్యాడు. క్రికెట్‌రంగంలో అంచెలంచెలుగా ఎదుగుతూ అన్ని విభాగాల్లో జిల్లా, జోన్, రాష్ట్ర స్థాయిల్లో సత్తా చాటి ముందుకు దూసుకెళుతున్నాడు. తన క్రికెట్ కెరీర్‌లో 24 దఫాలు అన్ని విభాగాల్లో రాష్ట్రస్థాయి క్రీడాకారుడిగా సత్తా చాటి అందరి దృష్టిని ఆకట్టుకున్నాడు. ఆ యువ క్రీడాకారుడే ధ్రువకుమార్‌రెడ్డి. అతని ప్రతిభకు గుర్తింపుగా... నేడు ఐపీఎల్ క్రికెట్‌లో అడుగు పెట్టే అవకాశం తలుపు తట్టింది. పంజాబ్ కింగ్స్ నుంచి ట్రైల్స్‌కు పిలుపు వచ్చింది. దీంతో పలువురు క్రికెట్ క్రీడాభిమానులు హర్షం వ్యక్తం చేస్తూ.. జట్టుకు ఎంపిక కావాలని కోరుకుంటున్నారు.

కుటుంబ నేపథ్యం...

ప్రొద్దుటూరు పట్టణానికి చెందిన సిగినేని లక్ష్మిరెడ్డి - శారదాదేవిలకు ఇద్దరు సంతానం. వారిలో ప్రథమ కుమారుడైన ధ్రువకుమార్‌రెడ్డి తొమ్మిదేళ్ల వయసులోనే బ్యాట్ చేతబట్టి క్రికెట్ రంగంలో తన ప్రతిభను చాటుతున్నాడు. లక్ష్మిరెడ్డి పోలీసు డిపార్ట్‌మెంటులో కానిస్టేబులుగా విధులు నిర్వహిస్తుండగా తల్లి శారదాదేవి గృహిణి. సోదరి ఎంబీబీఎస్ విద్యను పూర్తి చేసింది.

పదేళ్లలోనే ఎస్‌జీఎఫ్ నేషనల్స్

తొమ్మిది సంవత్సరాల వయసులో క్రికెట్ రంగంలో అడుగుపెట్టిన ధ్రువకుమార్‌రెడ్డి తన ప్రతిభతో అందరిని ఆకట్టుకున్నాడు. కేవలం ఒక సంవత్సరంలోనే పదేళ్లు వచ్చేసరికి స్కూలుగేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) అండర్ 14 విభాగంలో జాతీయస్థాయికి ఎంపికయ్యాడు. ఆ నాటి నుండి అండర్ 14, అండర్ 16, అండర్ 19, అండర్ 23, అండర్ 25 విభాగాల్లో తనదైన శైలితో బ్యాటింగ్‌ను ప్రదర్శిస్తూ రాష్ట్రస్థాయికి 24 దఫాలు ఎంపికై క్రికెట్‌లో తన ప్రతిభను నిరూపించుకున్నాడు.

విద్యాభ్యాసమంతా ప్రొద్దుటూరులోనే..

ధ్రువకుమార్‌రెడ్డి క్రికెట్‌పై ఉన్న మమకారంతో తన విద్యాభ్యాసమంతా ప్రొద్దుటూరులోనే కొనసాగించాడు. పదో తరగతి వరకు గోపిక్రిష్ణ స్కూలు, ఇంటర్మీడియట్ అభ్యాస్, డిగ్రీ సాధన డిగ్రీ కళాశాలలో చదువుతూనే ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రాక్టీసు చేస్తూ క్రికెట్ రంగంలో అంచెలంచెలుగా ఎదిగాడు.

కృషి, పట్టుదలతోనే..

క్రికెట్‌పై ఉన్న మక్కువతో తొమ్మిదేళ్ల వయసులోనే బ్యాట్ చేతబట్టి మొక్కవోని దీక్ష, పట్టుదలతో క్రికెట్ సాధన చేశాడు. ప్రతి విభాగంలో ఎంపికయ్యేందుకు ఓ పక్క చదువుతూ కష్టనష్టాలకోర్చుకుంటూ క్రికెట్ సాధన చేశాడు. అన్ని విభాగాల్లో రాణించడం ధ్రువకుమార్‌రెడ్డి పడ్డ శ్రమకు ఫలితమేనని అతని ఆటను పరిశీలిస్తున్న సన్నిహితులు, క్రికెట్ అసోసియేషన్ సభ్యులు చెబుతుంటారు.

పంజాబ్ కింగ్స్ నుంచి పిలుపు

అన్నివిభాగాల్లో రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరుస్తున్న యువ క్రికెటర్ ధ్రువకుమార్‌రెడ్డికి ఐపీఎల్ పంజాబ్ కింగ్స్ నుంచి ట్రైలర్స్‌కు పిలుపు వచ్చింది. ట్రైల్స్‌లో సెలక్ట్ అయితే ధ్రువకుమార్‌రెడ్డి ఐపీఎల్‌లో పంజాబ్ కింగ్స్‌లో స్థానం సంపాదించుకుంటాడు.



ధ్రువకుమార్‌రెడ్డి, యువ క్రికెటర్

జిల్లా నుంచి ఐపీఎల్‌లో ఆడిన రెండో ఆటగాడిగా గుర్తింపు తెచ్చుకునే అవకాశం ఉంది. ధ్రువకుమార్‌రెడ్డి పంజాబ్‌కింగ్స్ తరపున జట్టుకు ఎంపిక కావాలని ప్రొద్దుటూరు వాసులే కాకుండా జిల్లాలోని క్రికెట్ అభిమానులందరూ మనస్ఫూర్తిగా కోరుకుంటున్నారు.

దాదాపు వంద మ్యాచ్‌లు, 50కి పైగా సెంచరీలు

ధ్రువకుమార్‌రెడ్డి తన క్రికెట్ కెరీర్‌లో వంద మ్యాచ్‌ల పైబడి ఆడగా, దాదాపు 50 సెంచరీలను సాధించాడు. బ్యాట్ చేతబట్టి క్రీజ్‌లోకి దిగితే మెరుపులు మెరిపించే ఈ యువ క్రీడాకారుడు తన క్రికెట్ కెరీర్‌లో 80 శాతం మ్యాచ్‌లలో అత్యుత్తమ ప్రతిభను కనబరుస్తూ వచ్చాడు.

ఇండియా టీంలో స్థానం సంపాదించి.. దేశానికి సేవ చేయడమే లక్ష్యం

చిన్ననాటి నుంచి క్రికెట్ అంటే ప్రాణం. చదువుతో పాటు క్రికెట్ ప్రాక్టీసు వదలకుండా చేస్తూ అన్ని విభాగాల్లో రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాను. తల్లిదండ్రుల సహకారం, స్నేహితుల తోడ్పాటు, జిల్లా క్రికెట్ అసోసియేషన్ ప్రోత్సాహంతో ఇంత వరకు వచ్చాను. ఇండియా టీంకు సెలక్ట్ అయి దేశానికి సేవ చేయాలన్నదే లక్ష్యం.

- ధ్రువకుమార్‌రెడ్డి, యువ క్రికెటర్, ప్రొద్దుటూరు, కడప జిల్లా

ఆంధ్రజ్యోతి

కార్ అండ్ బైక్ రేస్



నవంబర్ నెల కూపన్ నంబర్ - 2

పాఠకుని పూర్తి పేరు	:	....
డోర్ నెంబరు	:	....
వీధి పేరు	:	....
గ్రామం / పట్టణం	:	....
మండలం	:	....
జిల్లా	:	....
పోస్టల్ పిన్‌కోడ్	:	....
ఫోన్ నంబర్	:	....

నాలుగు నెలల్లో ఆంధ్రజ్యోతి డ్రాలో ఇది నవంబర్ నెల రెండవ కూపన్ ఈ కూపన్‌లో మీ అడ్రస్ పూర్తి చేసి ఈ నెలలో ఇచ్చే మూడు కూపన్లను ఒక సెట్‌గా చేసి మీ వద్దనే ఉంచి నాలుగు నెలలు అయిన తర్వాత మొత్తం 12 కూపన్లను నాలుగు సెట్లుగా చేసి 2025 మార్చ్ నెల 10వ తేది నాటికి ఈ క్రింది అడ్రస్‌కు పోస్ట్ ద్వారా కాని, స్వయంగా కాని అందచేయవలెను.



నోట్ : సెట్‌గా కాకుండా విడిగా పంపిన కూపన్లు చెల్లవు.

* చట్ట ప్రకారం నిబంధనలు వర్తించును.

కూపన్లు పంపవలసిన చిరునామా

ఆంధ్రజ్యోతి కార్యాలయం : సర్వేనెం. : 137 & 138/3,
చిన్నమాచుపల్లె, చెన్నూరు మండలం, కడప.
అసిస్టెంట్ మేనేజర్ (సర్క్యులేషన్) : 99854 11184,
బ్రాంచ్ మేనేజర్ : 99854 11181

మేమున్నామని...

● భవన నిర్మాణ కార్మికులకు అండగా... ● 400 మంది కార్మికులకు ఆర్థికసాయం
● విద్య, ఆధునిక మెలకువలపై శిక్షణ ● ఆదర్శం బహుజన బిల్డింగ్ వర్కర్స్ అసోసియేషన్

పీలేరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): బహుజన బిల్డింగ్ వర్కర్స్ అసోసియేషన్ 2008లో పీలేరులో నలుగురు తాపీ మేస్త్రీలతో పురుడు పోసుకుంది. భవన నిర్మాణ రంగంలో నిరక్ష్యరాస్యులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలు ఎక్కువగా ఉండడం, అవగాహన లేమి కారణంగా శ్రమ దోపిడీకి గురవుతుండడంతో అప్పట్లో పీలేరులో పేరెన్నిక కలిగిన పలువురు తాపీ మేస్త్రీలు బహుజన బిల్డింగ్ వర్కర్స్ అసోసియేషన్‌ను ప్రారంభించారు. గృహ యజమానులకు, మేస్త్రీలు, కూలీలకు మధ్య ఏర్పడే తగాదాలను పరిష్కరించే వేదికగా ప్రారంభమైనప్పటికీ తదనంతర కాలంలో సామాజిక సేవా కార్యక్రమాల వారధిగా నిలిచింది. అసోసియేషన్‌లోని ఓ సభ్యుడి మదిలో మెదిలిన ఆలోచన దాదాపు 37 విభాగాల కార్మికులను సమన్వయం చేసుకుని, ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని 12 మండలాలకు విస్తరించి నేడు 3 వేల మంది కార్మికులకు సేవలందిస్తోంది.

400 మందికి ఆర్థిక సాయం

ఆవిర్భావం నుంచి నేటి వరకు పీలేరు బహుజన బిల్డింగ్ వర్కర్స్ అసోసియేషన్ దాదాపు 400 మందికి ఆర్థిక సాయం అందించింది. నిర్మాణ రంగం అంటేనే ప్రమాదాలమయం. ఎటువంటి రక్షణ కవచాలు, జాగ్రత్తలు లేకుండా చాలా మంది కార్మికులు దేవుడిపై భారం వేసి జీవనాధారం కోసం పనిచేస్తుంటారు. చిన్న చిన్న అజాగ్రత్తలతో పాటు అప్పుడప్పుడు మితిమీరిన ఆత్మవిశ్వాసం, నిర్లక్ష్యం కారణంగా ప్రమాదాలు జరుగుతూ ఉంటాయి. ఆ ప్రమాదాల్లో కార్మికులు ప్రాణాలు కోల్పోవడం, తీవ్ర గాయాల పాలవడం, కొన్నిసార్లు అంగవైకల్యం పొందడం జరుగుతూ ఉంటుంది. అటువంటి సందర్భాల్లో వారు పనిచేస్తున్న ప్రదేశాల్లోని యజమానులు జాలిపడో, బాధ్యతగానో అందించే అరకొర సాయం, వారు పనిచేస్తున్న మేస్త్రీ అందించే సాయమే వారికి దక్కే పరిహారం. అలా దక్కే పరిహారంతో ఆయా కుటుంబాలు ఇబ్బందులు పడడం అసోసియేషన్ నాయకుడైన బలరాం గమనించి తమలోని సహచరుడికి ఇబ్బంది కలిగినప్పుడు ఇతరుల మీద ఆధారపడడం కంటే తామే ఎందుకు ఆదుకోకూడదని ఆలోచించి కార్మికులందరినీ ఏకతాటిపైకి తెచ్చి ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు తలో చేయి వేసి సహచరులకు సాయం అందించాలని, ఆ సాయం ఒక్కసారికే పరిమితం కాకుండా వారికి అవసరమైనప్పుడల్లా ఆదుకోవాలని అందరినీ చైతన్యపరిచాడు. అలా బహుజన అసోసియేషన్‌లోని సభ్యులకు ఆర్థిక సాయం అందే ప్రక్రియ ప్రారంభమైంది. పీలేరు పరిధిలోని పీలేరు, కేవీ పల్లె, కలికిరి, గుర్రంకొండ, ఎర్రావారిపాళెం, చిన్నగొట్టిగల్లు, రొంపిచెర్ల, పులిచెర్ల, సదుం, సోమల, ఐరాల, పూతలపట్టు మండలాల్లో ఏదైనా ప్రమాదం జరిగినట్లు తెలిసిన వెంటనే అసోసియేషన్ సభ్యులు అక్కడకు వెళ్లి తక్షణ సాయంగా రూ.వేయి అందిస్తారు. సంఘటనా స్థలం నుంచి ఆయా కార్మికుల స్వస్థలాలకు తీసుకెళ్లేందుకు అవసరమైన రవాణా సదుపాయం ఏర్పాటు చేస్తారు. ఆ తరువాత ప్రమాదం గురించి తమ అసోసియేషన్ గ్రూపులో పోస్టు చేసి సాయం చేయాల్సిందిగా అర్థిస్తారు. గ్రూపులోని సభ్యులు తమకు తోచిన సాయాన్ని అసోసియేషన్ నాయకులకు ఫోన్ పేగానీ నగదుగానీ అందజేస్తారు. వారం రోజుల పాటు అందరి దగ్గర వసూలు చేసి ఆయా బాధిత కార్మికులు లేదా వారి కుటుంబసభ్యులకు అందజేస్తారు. ప్రమాద తీవ్రతను బట్టి రూ.5 వేల నుంచి రూ.లక్ష దాకా వసూలు చేస్తుంటారు. అలా ఇప్పటి వరకు సుమారు 400 మందికి రూ.5 వేల నుంచి రూ.లక్ష దాకా సాయం అందించినట్లు బలరాం తెలిపారు. సగటున నెలకు రెండు కేసులు తమ దృష్టికి వస్తుంటాయని, ఎటువంటి విసుగు లేకుండా తమ అసోసియేషన్ సభ్యులు స్పందించి తగిన ఆర్థిక సాయం అందజేస్తున్నారని ఆయన తెలిపారు. ప్రపంచాన్ని అతలాకుతలం చేసిన కరోనా సమయంలో ఎక్కువగా ఇబ్బంది పడింది భవన నిర్మాణ రంగ కూలీలే. ఆ సమయంలోనూ తమ అసోసియేషన్ ద్వారా వందలాది మంది కార్మికులకు నిత్యావసర సరుకులు అందించి వారిని ఆకలి బాధల నుంచి తప్పించారు.

చట్టాలు, పథకాలపై అవగాహన



భవన నిర్మాణ రంగంలోని కార్మికులు ప్రభుత్వ చట్టాలు, పథకాలపై అవగాహన పెంచుకోవాలి. అసంఘటిత రంగంలోని భవన నిర్మాణ రంగం కూలీల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలు అమలు చేస్తున్నా నిరక్షరాస్యత కారణంగా వాటిని కార్మికులు సద్వినియోగం చేసుకోలేకపోతున్నారు. ఒళ్లు హూనం చేసుకుని కష్టపడే కార్మికులు ఇతరుల దయాదాక్షిణ్యాలపై ఆధారపడకూడదన్నది నా అభిమతం. అందుకనే ప్రమాదాల కారణంగా ఇబ్బందిపడే కార్మికులకు ఏదైనా చేయాలన్న ఆలోచనతో ఆర్థిక సాయం వితరణ ప్రారంభించాం. నా ఆలోచనను మెచ్చుకుని తోటి సభ్యులు ఇప్పటి వరకు తమకు తోచిన సాయం అందిస్తున్నారు. భవిష్యత్తులో కూడా దీనిని కొనసాగిస్తాం.

-బలరాం, అధ్యక్షుడు, పీలేరు బహుజన బిల్డింగ్ వర్కర్స్ అసోసియేషన్



మేస్త్రీ కరీముల్లా కుటుంబసభ్యులకు ఆర్థికసాయం అందజేస్తున్న దృశ్యం (ఫైల్)

అవగాహన సదస్సుల నిర్వహణ

బహుజన బిల్డింగ్ వర్కర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కేవలం ఆర్థిక సాయం చేయడమే కాకుండా నిర్మాణ రంగంలో ఎప్పటికప్పుడు వస్తున్న ఆధునిక పద్ధతులు, వాటిని అందిపుచ్చుకునే వైనాన్ని కార్మికులకు వివరిస్తున్నారు. పలు సంస్థలు, తిరుపతి, హైదరాబాదు వంటి నగరాల్లో ఉన్న టెక్నీషియన్లను పిలిపించి తమ సభ్యులకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నారు. తద్వారా వృత్తిలో మెలకువలు నేర్పిస్తున్నారు. అంతేకాకుండా పనిప్రదేశాల్లో వాడాల్సిన రక్షణ పనిముట్ల గురించి తెలియజేసి స్వంతంగా గానీ లేక దాతల సాయంతో వాటిని సమకూర్చుకుని కార్మికులకు అందజేస్తున్నారు. భవన నిర్మాణ రంగ కార్మికులకు ప్రభుత్వం నుంచి లభించే ప్రయోజనాలను ఎప్పటికప్పుడు వివరిస్తూ తమతో కలిసి వచ్చే కార్మికులందరినీ కార్మిక శాఖ వద్ద నమోదు చేయించి వారికి ఆయా ప్రయోజనాలను అందేలా చర్యలు తీసుకుంటున్నారు. అంతేకాకుండా కార్మికులకు విద్య ప్రాధాన్యత వివరిస్తూ వారి పిల్లలు చదువుకునేలా చూడడమే కాకుండా ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న వారి పిల్లలకు వివిధ పాఠశాలల యాజమాన్యాలతో మాట్లాడి ఫీజులు కూడా తగ్గిస్తున్నారు.



కరోనా సమయంలో కార్మికులకు నిత్యావసర సరుకులు అందజేస్తున్న దృశ్యం (ఫైల్)



పని ప్రదేశంలో ధరించాల్సిన హెల్మెట్లపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అసోసియేషన్ నాయకులు, సభ్యులు (ఫైల్)

ఆనందంగా ఉంది



నిర్మాణ రంగంలో బాగా సంపాదించిన వాళ్లు చాలా తక్కువ. అధిక శాతం మంది కార్మికులే. ఏ పూటకాపూట కడుపు నింపుకునే వారు ఎక్కువ. ప్రమాదాలు జరిగినప్పుడు వారు ఇబ్బంది పడుతూ ఉంటారు. మా అధ్యక్షుడి ఆలోచన కారణంగా అటువంటి వారికి అంతో ఇంతో సాయం చేసే అవకాశం వచ్చినందుకు ఆనందంగా ఉంది. వారికి అండగా ఉన్నామని తెలియజేసేందుకు సాయం అందిస్తున్నాం.

-ప్రభాకర్ రాజు, కార్యదర్శి, పీలేరు బహుజన బిల్డింగ్ వర్కర్స్ అసోసియేషన్

సేవా కార్యక్రమాలు చూసి...



మా సహచరులకు నిరంతరం ఆర్థిక సాయం అందించే సంఘం నాకు ఎక్కడా కనిపించలేదు. ఆ సేవా కార్యక్రమం చూసి నేను స్వచ్ఛందంగా వారితో కలిసి పనిచేస్తున్నా. ప్రమాదం జరిగిందని తెలిసినప్పుడు చిన్న చిన్న వారు సైతం తమకు తోచిన సాయం చేస్తుంటారు. ప్రార్థించే పెదవుల కన్నా సాయం చేసే చేతులు మిన్న అంటారు. ఆ పనిని భవన నిర్మాణ రంగ కార్మికులు నిజం చేసి చూపిస్తున్నారు.

-ఎన్టీఆర్ నఫీస్, పీలేరు బహుజన బిల్డింగ్ వర్కర్స్ అసోసియేషన్

రోడ్డు పనులు నాణ్యతగా చేయాలి

కాంట్రాక్టర్, అధికారులను ఆదేశించిన కలెక్టర్ చామకూరి శ్రీధర్



కలెక్టర్ చామకూరి శ్రీధర్‌తో మాట్లాడుతున్న గ్రామస్థులు

చిన్నమండెం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రోడ్డు పనులను నాణ్యతగా చేయాలని, నాణ్యతలో రాజీపడవద్దని కలెక్టర్ చామకూరి శ్రీధర్ కాంట్రాక్టర్లు, అధికారులను ఆదేశించారు. మంగళవారం మండలంలో పర్యటించిన కలెక్టర్ తొలుత ఎంపీడీవో కార్యాలయంలో మండల అధికారులతో సమావేశం నిర్వహించారు. రెవెన్యూలో అసైన్డ్ భూములు, డాటెడ్ ల్యాండ్ భూముల గురించి పలు సూచనలు, సలహాలు చేశారు. అనంతరం తూర్పుపల్లి దళితవాడలో 10 లక్షల రూపాయలతో సీసీ రోడ్డు వేస్తున్న పనులను ఆయన పరిశీలించారు. అలాగే గొర్లముదివేడు నుంచి తూర్పుపల్లి వరకు కోటి రూపాయలతో వేస్తున్న సీసీ రోడ్లను ఆయన పరిశీలించి నాణ్యతగా రోడ్లు వేయాలని కాంట్రాక్టర్, అధికారులను ఆదేశించారు. ఉప్పరపల్లిలో ఓ వ్యక్తి సీసీ రోడ్డును తవ్వేసి అడ్డంగా గోడ నిర్మించి తమకు రహదారి లేకుండా చేశాడని, ఈ విషయం పలుమార్లు అధికారులకు చెప్పినా ఎవరూ పట్టించుకోలేదని వెంకట్రామిరెడ్డి ఆధ్వర్యంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. రోడ్డును తవ్వేసిన వ్యక్తిపై కేసు పెట్టాలని ఇన్‌చార్జ్ ఎంపీడీవో శేఖర్‌నాయక్‌ను కలెక్టర్ ఆదేశించారు. దేవదాయ భూములు ఆక్రమణకు గురయ్యాయరని కలెక్టర్ దృష్టికి తీసుకుపోగా ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకుని ఆ భూములను స్వాధీనం చేసుకోవాలని అధికారులను ఆదేశించారు.

ఉపాధి పనుల్లో అవకతవకలు

సిబ్బంది నుంచి రూ.40 వేలు రికవరీ



సమావేశంలో మాట్లాడుతున్న డ్వామా పీడీ

పెద్దమండ్యం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా చేసిన పనులకు సామాజిక బృందం తనిఖీలు నిర్వహించి రూ.40 వేలు రికవరీ చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. పెద్దమండ్యం ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో మంగళవారం డ్వామా పీడీ వెంకటరత్నం, ఏపీడీలు ప్రతాప్, మధుబాబు, ఎంపీడీవో శ్రీధర్‌రావు, ఏపీవో మురళి, ఎంపీపీ పూర్ణచంద్రిక రమేశ్, కో-ఆప్షన్ సభ్యుడు ఖాదర్‌వలి సమక్షంలో సామాజిక తనిఖీ బృందం బహిరంగ ప్రజావేదిక నిర్వహించారు. మండలంలో జరిగిన పనులకు ఈనెల 8వ తేదీ నుంచి 18వ తేదీ వరకు సామాజిక బృందం పనులను తనిఖీ చేశారు. ఉపాధి పనుల మస్టర్‌లలో సంతకాలు లేకుండా చెల్లింపు, అదనపు చెల్లింపులు, ఎక్కువ పనిచేసిన వారికి తక్కువ చెల్లింపులతో సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ఉపాధి సిబ్బంది నుంచి రూ.40 వేలు రికవరీ చేయించాలని తేల్చినట్లు వెల్లడించారు. నలుగురు ఉపాధి సిబ్బందికి రూ.5 వేలు జరిమానా విధించారు. ఉపాధి నిధులతో నాటిన మామిడి తోటల్లో సుమారు రూ.2 లక్షల విలువ చేసే మామిడి చెట్లు ఎండిపోయాయి, ఎండిన మొక్కల స్థానంలో పచ్చని మొక్కలను రైతుల నుంచి నాటించాలని ఉపాధి సిబ్బందిని డ్వామా పీడీ ఆదేశించారు.

ఉపాధ్యాయుడి సస్పెన్షన్

రాయచోటి టౌన్/ సుండుపల్లె, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థినులతో అసభ్యకరంగా ప్రవర్తించినట్టు ఆరోపణలు ఎదుర్కొన్న బుర్రలదిన్నె పాఠశాల ఉపాధ్యాయుడు నాగముని నాయక్‌ను సస్పెండ్ చేస్తూ డీఈవో కె.సుబ్రమణ్యం మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. టి.సుండుపల్లె మండలం బుర్రలదిన్నె పాఠశాలలో ఎస్జీటీగా పనిచేస్తున్న నాగముని నాయక్ విద్యార్థినులతో అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడంటూ ఫిర్యాదులు అందడంతో విచారణ చేసి కలెక్టర్‌కు నివేదిక సమర్పించామన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆయనను సస్పెండ్ చేస్తూ ఆదేశాలిచ్చినట్లు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

అడవిపల్లి రిజర్వాయర్‌కు 6-7 నెలల్లో నీరు

● అసెంబ్లీలో మంత్రి నిమ్మల రామానాయుడు వెల్లడి

అమరావతి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): హంద్రీ-నీవా సుజల స్రవంతి పనులు వేగంగా పూర్తి చేయాలని సీఎం చంద్రబాబు ఇటీవలే సమీక్ష సందర్భంగా ఆదేశించారని, ఆ కాలువ చివరి ప్రాజెక్టు అయిన అడవిపల్లి రిజర్వాయర్‌కు ఆరేడు నెలల్లో నీరు వస్తుందని జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడు వెల్లడించారు. మంగళవారం అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సమయంలో పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి తన నియోజకవర్గంలోని అడవిపల్లి రిజర్వాయర్ గురించి ఆవేదన వ్యక్తం చేశారు. చంద్రబాబు 2019లో ముఖ్యమంత్రిగా దిగిపోయే నాటికి రూ.2,500 కోట్లు ఖర్చు చేసి పూర్తిచేసిన ఈ జలాశయంలోకి కేవలం రూ.280 కోట్లు పెడితే నీరు వస్తుందన్నారు. ఒకచోట పదెకరాలు, మరోచోట ఆరెకరాలు భూసేకరణ పెండింగ్ వల్ల హంద్రీ-నీవా కాలువ పనులు సాగడం లేదని గత ఐదేళ్లు 82 వేల ఎకరాలకు సాగునీరు అందకుండా పోయిందని వాపోయారు. ఇదే సమయంలో రాష్ట్రంలో ఎక్కడికక్కడ సాగునీటి కాలువలకు మరమ్మతులు చేయలేదని పలువురు ఎమ్మెల్యేలు ప్రస్తావించారు. నిమ్మల స్పందిస్తూ అడవిపల్లి రిజర్వాయర్‌కు ఆరేడు నెలల్లో నీరు వస్తుందన్నారు. అన్నమయ్య ప్రాజెక్టు కొట్టుకుపోయి ఊళ్లకు ఊళ్లను ముంచేస్తే జగన్ సర్కారు పట్టించుకోలేదని మండిపడ్డారు. గత ఐదేళ్లలో సాగునీటి రంగం పూర్తి నిర్లక్ష్యానికి గురైందని.. దీనికి మరమ్మతు చేసేందుకు సీఎం చంద్రబాబు ప్రణాళికాబద్ధంగా శ్రమిస్తున్నారని తెలిపారు. కరువు ప్రాంత భూములకూ నీరిస్తామని స్పష్టం చేశారు.

పంట మార్పిడితో మంచి దిగుబడులు



పొలం పిలుస్తోంది కార్యక్రమంలో జిల్లా వ్యవసాయశాఖ అధికారి చంద్రానాయక్

ములకలచెరువు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పంట మార్పిడి పద్ధతితో మంచి దిగుబడులు సాధించవచ్చని జిల్లా వ్యవసాయశాఖాధికారి చంద్రానాయక్ తెలిపారు. మండలంలోని బురకాయలకోటలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వరి పంట సాగు చేసిన రైతులు తరువాత పంట మార్పిడి చేసి మొక్కజొన్న పంట సాగు చేస్తే పెట్టుబడి ఖర్చులతో పాటు ఎక్కువ ఆదాయం పొందచ్చన్నారు. రబీలో వరి, వేరుశనగ పంట సాగు చేస్తున్న రైతులు తప్పనిసరిగా డిసెంబరు 15వ తేదీ లోగా పంటల బీమాను చేయించుకోవాలన్నారు.

అనంతరం పంటల సాగుపై పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో టెక్నికల్ ఏవో రమేష్‌రాజు, మండల వ్యవసాయాధికారి లీలాకుమారి, రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

మల్లయ్యకొండ కోనేరు వెలవెల...

● నీటి తొట్టె వద్ద స్నానమాచరించి దర్శనానికి వెళుతున్న భక్తులు ● పట్టించుకోని దేవదాయశాఖ అధికారులు

తంబళ్లపల్లె, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : తంబళ్లపల్లె సమీపంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మల్లయ్యకొండ జిల్లాలోనే పురాతన శైవక్షేత్రాల్లో ప్రసిద్ధి గాంచింది. కార్తీక మాసంలో మల్లయ్యకొండకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి వేల సంఖ్యలో భక్తులు వస్తుంటారు. తలనీలాలు సమర్పించిన వారు, భక్తులు, మాలదారులు కొండపైన ఉన్న కోనేరులో స్నానమాచరించి అనంతరం స్వామి వారిని దర్శించుకుంటారు. అయితే, కొన్నిరోజుల ముందు కోనేరులోని నీరు దుర్గంధంగా మారి అపరిశుభ్రంగా ఉండటంతో దేవదాయశాఖ సిబ్బంది శుభ్రపరచారు. అప్పటి నుంచి కోనేరుకు నీరు పట్టకపోవడంతో భక్తులు సమీపంలో ఉన్న నీటి తొట్టెలో స్నానమాచరించి స్వామి వారిని దర్శించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. తలనీలాలు సమర్పించిన వారి పరిస్థితి మరీ దారుణంగా ఉంటోంది. కోనేరులో నీరు లేకపోవడంతో నీటి తొట్టెలోని నీటితోనే స్నానం చేయాల్సి వస్తోంది. పలువురు భక్తులు కోనేరులో ఉన్న అరకొర నీటిలోనే శివ..శివ.. అంటూ తల తడుపుకుని స్వామిని దర్శించుకుంటున్నట్లు వాపోతున్నారు. ప్రతి ఏటా భక్తులు సమర్పించిన హుండీ కానుకలు, వేలం పాటల ద్వారా మల్లయ్యకొండకు లక్షల్లో ఆదాయం వస్తున్నా భక్తులకు కనీస సౌకర్యాలు కల్పించడంలో దేవదాయశాఖ అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని భక్తులు వాపోతున్నారు. వెంటనే కోనేరును నీటితో నింపాలని భక్తులు కోరుతున్నారు.

రోడ్డును కమ్మేసిన పిచ్చిమొక్కలు

మద్దాతంబావి నుంచి మల్లయ్యకొండ పైకి ఉన్న ఘాట్ రోడ్డును పలుచోట్ల పిచ్చిమొక్కలు కమ్మేశాయి. ప్రతి సోమవారం వందల సంఖ్యలో ద్విచక్రవాహనాలు, కార్లు, జీపులు, ట్రాక్టర్లతో పాటు ఆర్టీసీ బస్సులు కొండకు తిరుగుతుంటాయి. ఇటీవల కురిసిన వర్షాలకు పలుచోట్ల రోడ్డుకు ఇరువైపులా, మలుపుల వద్ద పిచ్చి మొక్కలు విపరీతంగా పెరిగి ఘాట్ రోడ్డు పైకి వచ్చాయి. దీంతో మలుపుల్లో వచ్చే వాహనాలు కనిపించక వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. ప్రమాదాలు చోటుచేసుకోక ముందే మలుపుల వద్ద, రోడ్డు పైకి వచ్చిన పిచ్చిమొక్కలు తొలగించాలని వాహనదారులు, భక్తులు కోరుతున్నారు.

రెండు రోజుల్లో నీటిని నింపుతాం

కోనేరులో పూలు, ఆకులు ఎక్కువగా ఉండటంతో ఇటీవలే సిబ్బంది నీటిని తీసివేసి శుభ్రపరచారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా కోనేరుకు సమీపంలో నీటిని ఏర్పాటు చేశాం. రెండు రోజుల్లో తప్పకుండా కోనేరులో నీటిని నింపుతాము.

- మునిరాజ. ఈవో, మల్లయ్యకొండ, తంబళ్లపల్లె







కోనేరులో ఉన్న అరకొర నీటిలోనే స్నానాలు చేస్తున్న భక్తులు - నీటి తొట్టె వద్ద స్నానమాచరిస్తున్న భక్తులు - మల్లయ్యకొండకు వెళ్లే ఘాట్ రోడ్డు పైకి పెరిగిన పిచ్చిమొక్కలు

దేవాలయ రోడ్డు పనుల పరిశీలన



రోడ్డు పనులు పరిశీలిస్తున్న ఈఈ సూర్యచంద్రారెడ్డి

రామసముద్రం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రామసముద్రం మండలంలోని వాళీశ్వరస్వామి, గట్టు వెంకటేశ్వరస్వామి దేవాలయాలకు వెళ్లే రోడ్డు పనులు జరుగుతుండగా వాటిని చిత్తూరు జిల్లా క్వాలిటీ కంట్రోలర్ ఈఈ సూర్యచంద్రారెడ్డి మంగళవారం పరిశీలించారు. చెంబకూరు మెయిన్ రోడ్డు నుండి గట్టు వెంకటేశ్వరస్వామి ఆలయానికి వెళ్లే రోడ్డు సుమారు రూ.80లక్షలతో, వాళీశ్వరస్వామి కొండకు వెళ్లే రోడ్డు రూ.2కోట్లతో పనులు జరుగుతుండగా వీటిని ఈఈ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీ టూరిజం అభివృద్ధి కార్యక్రమం కింద ఈ ఆలయాలకు రోడ్డు కల్పించడం ద్వారా ఆలయాల అభివృద్ధి జరుగుతుందన్నారు. రోడ్డు పనులలో నాణ్యత లోపం లేకుండా జరుగుతున్నాయని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. వచ్చే ఏడాది మార్చి నాటికి వాళీశ్వరస్వామి ఆలయ రోడ్డు పనులు పూర్తి కావాలని ఈఈ తెలిపారు. ఈకార్యక్రమంలో క్వాలిటీ కంట్రోలర్ డీఈ భాస్కర్, మదనపల్లె పంచాయతీ రాజ్ డీఈఈ శివప్రసాద్, ఏఈ నిరంజన్‌రెడ్డి, కాంట్రాక్టర్ గౌనివారి రెడ్డెప్పరెడ్డి, మాజీ జడ్పీటీసీ కృష్ణంరాజు, స్థానికం రాజేష్, మిట్టపల్లె నాగరాజ పాల్గొన్నారు.

ఎర్రచందనం స్మగ్లరు అరెస్టు

దుంగలు, వాహనం స్వాధీనం



ఎర్రచందనం దుంగలు, వాహనం, నిందితులతో ఎఫ్ఆర్ఓ నయీం అలీ తదితరులు

బద్వేలు రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కొంగళవీడు సమీపంలో రవాణాకు సిద్ధంగా ఉంచిన వాహనం సహా ఏడు ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకుని ఒకరిని అరెస్టు చేసినట్లు ఫారెస్టురేంజ్ ఆఫీసరు కేఎన్ నలీంఅలీ తెలిపారు. డీఎఫ్ఓ వినీత్‌కుమార్, సబ్ డీఎఫ్ఓ స్వామి వివేకానంద ఆదేశాల మేరకు ఎర్రచందనం అక్రమ రవాణా నివారణలో భాగంగా నిర్వహించిన తనిఖీల్లో కొంగళవీడు వద్ద వాహనంలో ఎర్రచందనం దుంగలు అక్రమ రవాణా జరుగుతోందని అందిన సమాచారం మేరకు దాడులు చేశామన్నారు. దాడుల్లో టాటా ఏసర్, ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని కర్ణాటక రాష్ట్రం కటికనహళ్లికి చెందిన సయ్యద్ ముబారక్‌ను అరెస్టు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ దాడుల్లో శేషయ్య డిప్యూటీ ఫారెస్టురేంజర్, ఎఫ్‌బీఓ సువర్ణకుమార్, రాజేశ్‌రెడ్డి, ఏబీఓ షాజహాన్ పాల్గొన్నట్లు ఆయన తెలిపారు. పట్టుబడిన దుంగల విలువ సుమారు రూ.లక్ష వరకు ఉంటుందని తెలిపారు.

సిమెంట్ రోడ్ల నిర్మాణాలు నాణ్యతగా చేపట్టాలి

● ఏపీఆర్ఆర్‌పీ అడ్వైజర్లు నరసింహారావు, ప్రభాకర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఏపీఆర్ఆర్‌పీ అడ్వైజర్ ప్రభాకర్‌రెడ్డి

కడప రూరల్, నవంబర్ 19 (ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పథకం (ఎంజీఎన్ ఆర్ ఈ జీ ఎస్) ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో చేపట్టే సిమెంట్ రోడ్ల నిర్మాణాలను నాణ్యత, పారదర్శకంగా చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ రూరల్ రోడ్ ప్రాజెక్టు అడ్వైజర్లు వై.నరసింహారావు, కె. ప్రభాకర్‌రెడ్డి, పీ ఆర్ ఎస్ఈ శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. కడప నగరంలోని పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖలో సీసీ రోడ్ల నాణ్యతా ప్రమాణాలపై అవగాహన చేపట్టిన వారు మాట్లాడుతూ పల్లెసీమల ప్రగతికి ఎంజీఎన్ఆర్ఈజీఎస్ పథకం వరంలాంటిదన్నారు. ఈ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల రహదారులకు మహర్దశ ఏర్పడుతుందన్నారు. ప్రస్తుత కేంద్ర రాష్ట్రాల పాలనలో వైఎస్ఆర్ జిల్లాలో దాదాపు రూ.75 కోట్ల ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నిధులతో రోడ్ల నిర్మాణాలను చేపడుతున్నారన్నారు. ఇందులో సిమెంట్ రోడ్ల నిర్మాణాలకు ఎక్కువగా ఖర్చు చేస్తామన్నారు. ఇందుకు సంబంధించి ఎస్టిమేట్ ఎలా ప్రిపేర్ చేయాలి, నేమ్‌ఆఫ్‌ది వర్కు, ఎస్టిమేట్ కాస్ట్, అడ్మినిస్ట్రేటివ్ శాంక్షన్ తదితర అంశాలపై పవర్ ప్రజెంటేషన్ ద్వారా ఉమ్మడి కడప జిల్లాలోని డీఈలు, ఏఈలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు రెండు విడతలుగా శిక్షణను నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా మంగళవారం పీఆర్ ఎస్ఈ కార్యాలయంలోని సమావేశ హాలులో రాజంపేట, రైల్వేకోడూరు, రాయచోటి, కమలాపురం, మైదుకూరు, బద్వేల్ నియోజకవర్గాల పరిధి అధికారులకు శిక్షణ ఇచ్చి అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. శిక్షణలో నేర్చుకున్న విషయాలను సిమెంటు రోడ్ల నిర్మాణాలు చేపట్టేటప్పుడు పరిగణలోకి తీసుకోవాలన్నారు. రాజంపేట, రైల్వేకోడూరు, రాయచోటి, కమలాపురం, మైదుకూరు, బద్వేల్ నియోజకవర్గాల పరిధి డీఈలు, ఏఈలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

సివిల్స్ ఉచిత శిక్షణకు 24లోగా దరఖాస్తు చేసుకోండి

కడప మారుతీనగర్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): యూపీఎస్సీ నిర్వహించే సివిల్స్ ప్రిలిమినరీ, మెయిన్స్ పరీక్షలకు అర్హత గల జిల్లాలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు 24లోగా దరఖాస్తు చేసుకోవాలని కడప బీసీ స్టడీ సంచాలకులు కృష్ణయ్య తెలిపారు. విజయవాడలోని గొల్లపూడి వద్దవున్న బీసీ భవన్‌లో ఉచిత శిక్షణ కోసం ఈనెల 24 లోగా కడప పాత కలెక్టరేట్‌లోని తమ కార్యాలయంలో దరఖాస్తులు ఇవ్వాలన్నారు. 27న స్ర్కీనింగ్ పరీక్ష నిర్వహిస్తారు. ఇందులో ఉత్తీర్ణులకు మెరిట్ ఆధారంగా విజయవాడలో శిక్షణ ఇస్తారన్నారు. బీసీలకు 66శాతం, ఎస్సీలకు 20 శాతం, ఎస్టీలకు 14 శాతం రిజర్వేషన్ ప్రాతిపదికన ఎంపిక చేసి ఉచిత శిక్షణ ఇస్తారన్నారు. కావున సివిల్స్ ప్రిలిమినరీ, మెయిన్స్ పరీక్షలకు దరఖాస్తు చేసే అభ్యర్థులు బయోడేటా సహా టెన్త్, ఇంటర్, డిగ్రీ, మార్కులిస్టులు, కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలు, తల్లిదండ్రుల వార్షిక ఆదాయం 1 లక్ష లోపు మాత్రం, వుండాలన్నారు. వీటితో పాటుగా ఆధార్, బ్యాంక్‌పాస్ బుక్, 2 పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు జతపరచి తమ కార్యాలయంలో దరఖాస్తులివ్వాలన్నారు. వివరాలకు 9849919221, 9966418572ను సంప్రదించాలన్నారు.

వారసత్వ సంపదలో దేశంలోనే మేటి కడప



సమావేశంలో మాట్లాడుతున్న ఆచార్య జి.సాంబశివారెడ్డి

కడప ఎర్రముక్కపల్లె, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): వారసత్వసంపద విషయంలో కడప జిల్లా దేశంలోనే మేటిగా నిలుస్తుందని ప్రముఖ చరిత్రకారులు ప్రొఫెసర్ జి.సాంబశివారెడ్డి అన్నారు. మంగళవారం కడప నగరంలోని పాత కలెక్టరేట్ ఆవరణలోని ఇంటాక్ కార్యాలయంలో ప్రపంచ వారసత్వ దినోత్సవాన్ని పురస్కరించుకుని సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలో మన జిల్లాలో ఉన్నన్ని వారసత్వ ప్రదేశాలు, సంపద మరెక్కడాలేవన్నారు. వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనదేనన్నారు. చింతకుంట చిత్రాలను కాపాడుకునేందుకు ఇన్‌టాక్ కోర్టు వరకు వెళ్లి విజయం సాధించిందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పోచంరెడ్డి సుబ్బారెడ్డి, లయన్స్ క్లబ్ మాజీ అధ్యక్షుడు పోతుల వెంకట్రామిరెడ్డి, పూర్వకో కన్వీనరు వేణుగోపాల్, సంస్థ పూర్వకన్వీనరు ఎలియాస్‌రెడ్డి, పలువురు ఇన్‌టాక్ సభ్యులు పాల్గొన్నారు.

ఆధార్‌తో ఖాతాల అనుసంధానానికి 30 వరకు గడువు

పోస్టల్ సూపరింటెండెంట్ కిరణ్ వెల్లడి

ప్రొద్దుటూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలసొమ్ము ను నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి పొందాలంటే ఆధార్‌తో ఖాతాలను అనుసంధానం తప్ప నిసరి అని పోస్టల్ సూపరింటెండెంట్ కిరణ్ తెలిపారు. ఆయన విలేకరులతో మాట్లాడు తూ సూమారు 65 లక్షల మంది లబ్ధిదారులకు ఎన్‌పీసీఐ మ్యాపర్‌లో ఆధార్ సీడింగ్ లేక పోవడంతో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలమేరకు ప్రొద్దుటూరు డివిజన్ పరిధిలోని అన్ని తపాలా కార్యాలయాల్లో ఆధార్‌తో ఖాతాల అనుసంధానప్రక్రియ నవంబరు 30 వరకు చేస్తారన్నా రు. 18 ఏళ్లు నిండి ఖాతాలేని ప్రతి లబ్ధిదారునికీ కొత్త ఇండియన్ పోస్ట్ పేమెంట్ బ్యాంక్ అకౌంట్ ఆధార్ అనుసంధానంతో ఓపెన్ చేయాలన్నారు. ఇందుకోసం కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్ రోజూ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటలకు ఏర్పాటు ఉంటుందన్నారు. కావున ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రూ.61.36 లక్షల నిధుల దుర్వినియోగం

వైసీపీ మాజీ సర్పంచ్ దేవీప్రసాద్‌రెడ్డిపై కేసు నమోదు

ప్రొద్దుటూరు నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): గోపవరం పంచాయతీ వైసీపీ మాజీ సర్పంచ్ కుప్పిరెడ్డి దేవీ ప్రసాద్‌రెడ్డి రూ. 61.36 లక్షల నిధుల దుర్వినియోగంపై క్రిమినల్ కేసు నమోదైనట్లు రూరల్ సీఐ బాలమద్దిలేటి తెలిపారు. వివరాల్లోకెళితే... 2016-17లో గోపవ రం పంచాయతీలో రోడ్లు వేయకున్నా వేసినట్లు అప్పటి సర్పంచ్ దేవీప్రసాద్‌రెడ్డి బిల్లులు చేసుకున్నారు. దీనిపై కొందరు కలెక్టరుకు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ జడ్పీ సీఈఓను విచారణ అధికారిగా నియమించారు. ఆవిచారణలో రోడ్లువేయకున్నా వేసినట్లు తప్పుడు బిల్లులు చేసుకున్నట్లు తేలింది. తరువాత వైసీపీ ప్రభుత్వంలో ఆ విచారణ నివేదిక అట కెక్కింది. కొందరు లోకాయుక్తలో కేసు వేయడంతో కొన్ని నెలలుగా విచారణ జరిగింది. నిధుల దుర్వినియోగంపై సదరు బాధ్యులపై చర్యలు తీసుకుని ప్రభుత్వ నిధులు రికవరీకి లోకాయుక్త ఆదేశించింది. దీంతో లోకాయుక్త ఆదేశాల మేరకు డీఎల్‌పీఓ తిమ్మక్క రూరల్ పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేశారు. తిమ్మక్క ఫిర్యాదుపై మాజీ వైసీపీ సర్పంచ్ కుప్పిరెడ్డి దేవీప్రసాద్ రెడ్డిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

యువకుడిని చితకబాదిన పలువురిపై కేసు నమోదు

బద్వేలుటౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక సీఎస్ఐ చర్చి సమీపంలో మంగళవారం యువకుడిని నలుగురు వ్యక్తులు చితకబాదిన సంఘటన బద్వేలులో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు హర్షవర్ధన్ వస్తుండగా బైక్ ఢీ కొనడంతో జాఫర్, నాయబ్, ఓబులేసు, మరొకరు చితకబాదారు. దీంతో హర్షవర్ధన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా వారిపై కేసు నమోదు చేసి విచారిస్తున్నామన్నారు.

పేట్రేగుతున్న కబ్జాల పర్వం



మైసూరివారిపల్లె ఏటిపోరంబోకు స్థలంలో నాటిన మామిడి మొక్కలు

రైల్వేకోడూరు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలో కోట్లు విలువైన వంక, ఏటిపోరంబోకు స్థలాలు కబ్జాలకు గురవుతున్నాయి. ఈ కబ్జాల పర్వం చాలా రోజులుగా సాగుతోంది. చివరకు ఏట్లో ఇసుకనూ వదలడం లేదని స్థానికులు ఆరోపణలు గుప్పిస్తున్నారు. ఇటు అధికారులు, అటు ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో కబ్జాలు తారాస్థాయికి చేరుకుంటున్నాయి. వివరాల్లోకెళితే.... రాఘవరాజపురం పంచాయతీలోని గంగరాజపురం ప్రధానదారిలో కొందరు వ్యక్తులు ఇటీవల రాత్రికి రాత్రే కోట్లు విలువైన ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి కట్టడాలు చేశారు. ఫలితంగా ఇరు రాజకీయ పక్షాల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటున్నాయి. పంచాయతీలోని స్థానికులు, గంగరాజపురం లోని ఆక్రమణదారులకు మధ్య విపరీతంగా గొడవలు జరిగాయి. దీంతో రెవెన్యూ అధికారులు అక్రమ కట్టడాలను నిలిపి బోర్డు నాటారు. గంగరాజపురం వద్ద ప్రధానదారిలో ఉన్న ప్రభుత్వ వంక పోరంబోకు స్థలం సుమారు రెండెకరాలు ఉంది. ఇది సుమారు రూ. 5కోట్లు విలువ చేస్తుంది. ఈ భూమికి గతంలో సర్వే నెంబరు 38/1 ఉండేది. రీసర్వేలో భాగంగా ఎల్‌పీ నెం. 178గా మారిందని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. ఇరిగేషన్ శాఖ పరిధిలో వంక, ఏటి పోరంబోకు స్థలా లున్నా ఆ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణ లున్నాయి. రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల మధ్య సమ న్వయం లేదని స్థానికులు చెబుతున్నారు. ఇద్దరి భాగస్వామ్యంతో కోట్లు విలువైన ప్రభుత్వ వంక, ఏటి పోరంబోకు స్థలాలను కాపడుకోవచ్చని ప్రజ లు అంటున్నారు. వైసీపీ ప్రభుత్వంలో కబ్జాల పర్వం అత్యధికంగా నడిచింది. అదే తంతును కూ టమి ప్రభుత్వం కూడా చేస్తోందని ఆరోపణలు వస్తున్నాయి. ఏట్లో ఇసుక, రాళ్లు, మట్టి అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. లక్షలు విలువైన ఏటి వనరులను దోచుకుంటున్నారు. నియోజ కవర్గంలో వైసీపీ, కూటమి మిలాఖత్ కావడంతో కబ్జాలు ఎక్కువగా సాగుతున్నాయి. ఇదిలా ఉండగా మైసూరివారి పల్లె పంచాయతీకి ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్‌కల్యాణ్ పెద్దఎత్తున నిధుల వర్షం కురిపించారు. అక్కడ రూ. 60 లక్షలు పెట్టి ఆట స్థలం కోసం పొలాన్ని తీసుకున్నారు. కోట్లాది రూపాయల వ్యయంతో రోడ్లు, డ్రైనేజి వ్యవస్థ, పాఠశాలకు వసతులు, క్రీడా మైదానం, తదితర వాటిని ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ పంచాయతీపై ప్రేమ కురిపించిన పవన్‌కల్యాణ్‌కు చెడ్డ పేరు తీసుకువచ్చేలా కబ్జా పనులు సాగుతున్నాయి. సర్వే నెంబరు 2085లో 17.54 ఎకరాల వంక పోరంబోకు స్థలం ఉంది. వైసీపీ ప్రభుత్వంలో ఈ భూమిపై పలువురు కన్నేశారు. వైసీపీ ప్రభుత్వంతో మైసూరివారిపల్లె ప్రజలు, జనసేన నేతలు పెద్దగా పోరాడారు. అయినా సుమారు ఐదెకరాలు కబ్జాకు గురైంది. కూటమి ప్రభుత్వం రాగానే కొందరు నేతల అండతో ఇదే సర్వే నెంబరులో మిగిలిన వంక పోరంబోకు స్థలాన్ని కబ్జా చేశారు. ఈ విషయంపై ఉన్నత స్థాయి కూటమి నేతలకు సమాచారం వెళ్లింది. అధికారులు కూడా ఏమీ చేయలేక తలలుపట్టుకుంటున్నారు. అధికారులు వంక, ఏటి పోరంబోకు స్థలాలకు సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు పట్టాలు ఇచ్చే సాహసం చేయలేకున్నారు. గతంలో అధికారులు వైసీపీ పెద్దలు చెప్పినట్లు అధికారులు తలలు ఆడించారు. దీంతో కూటమి ప్రభుత్వంలోనూ అధికారులపై కేసులు నమోదు అవుతుండడం కూటమి నేతలకు తెలియదా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రజలకు మంచి ప్రభుత్వాన్ని ఇస్తామని, ఎక్కడా కబ్జాలకు తావు లేకుండా చేస్తామని నేతలు హామీలు ఇచ్చి నేడు వారే చేస్తే ఎలా అనే ప్రశ్నలు ఎదురవడం కొసమెరుపు.





ఇటీవల గంగరాజపురం వద్ద ఆక్రమణలపై చోటుచేసుకున్న వివాద దృశ్యం - గంగరాజపురం వద్ద వంకపోరంబోకు స్థలానికి బోర్డు నాటిన రెవెన్యూ అధికారులు

చర్యలు తీసుకుంటాం

కబ్జా దారులపై చర్యలు తీసుకుంటాము. కబ్జాకు గురైన ప్రాంతంలో కట్టడాలు, పండ్ల మొక్కలు ఉంటే మాత్రం తొలగిస్తాము. వంక, ఏటి పోరంబోకు స్థలాలను కబ్జాలు చేస్తే మాత్రం చట్టరీత్యా చర్యలు తీసుకుంటాము.

మహబూబ్ చాంద్,
తహసీల్దారు రైల్వేకోడూరు

విధివంచిత ఆ నవ వధువు

కాళ్ల పారాణి ఆరకముందే మృత్యు కౌగిట్లోకి స్వాతి ● తండ్రి ఫిర్యాదుతో కేసు నమోదు



నవవధువుగా... విగత జీవిగా స్వాతి

పెద్దముడియం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆనందంగా జీవితాన్ని అనుభవించాలని, కొత్త వైవాహిక జీవితంలో ఉండే అనుభూతులు, అనుభవాలు ఆస్వాదిస్తూ భర్తతో కలిసి నూరేళ్ల జీవితాన్ని గడపాలని ఆమె ఊహించుకుంది. బిడ్డల పెరుగుదల, వారికి కల్పించే సదుపాయాలపై ఒకింత అవగాహనకు వచ్చింది. ఇలా భర్తతో వివాహ జీవితంపై ఎన్నో ఆశలు పెంచుకుంది. కాళ్ల పారాణి ఆరకముందే కాలం కాటేయడంతో విధి చేతిలో నవవధువు స్వాతి(20) ఓడింది. పెళ్లి జరిగిన ఇంట కట్టిన మామిడి తోరణాలు వాడకముందే పెళ్లి భాజా మోగి 24గంటలు తిరగకముందే చావు మేళా మోగింది. ఈ హృదయ విదారక ఘటన పెద్దముడియంలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్ఐ సుబ్బారావు అందించిన వివరాల్లోకెళితే...

పెద్దముడియం గ్రామానికి చెందిన హేమంత్‌కు పెండ్లిమర్రి మండలానికి చెందిన స్వాతితో 17న పెద్దముడియంలో వరుడి స్వగృహంలో బంధువుల సమక్షంలో వివాహం జరిగింది. వేడుక జరిగిన వెంటనే బంధువులంతా ఎవరి ఇళ్లకు వారు వెళ్లిపోయారు. 18వతేదీ సోమవారం మళ్లిపెళ్లి జరగాల్సి ఉంది. కాగా 18న సోమవారం ఉదయం నిద్రలేచిన స్వాతి స్పృహ తప్పి ఒక్కసారిగా కుప్పకూలింది. గమనించిన వరుడు హేమంత్ కుటుంబీకులు స్వాతిని హుటాహుటిన చికిత్స కోసం అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే ఆ వధువు తనువు చాలించింది. వరుడు, వారి బంధువుల సమాచారంతో మృతురాలి తల్లిదండ్రులు సంఘటనాస్థలం పెద్దముడియం చేరుకున్నారు. నవవధువు స్వాతిని విగతజీవిగా చూడడంతో తల్లిదండ్రులు కన్నీటి పర్యంతమయ్యారు. చూసిన వారు అయ్యో పెళ్లింట్లో ఇంత విషాదమా అంటూ విచారం వ్యక్తం చేశారు. ఈ మేరకు మృతురాలి తండ్రి ఓబన్న పెద్దముడియం పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మొత్తమ్మీద పెళ్లింట ఇలా 24గంటలు గడవకముందే ఇలాంటి దారుణం చోటు చేసుకోవడంతో ఆ ప్రాంతంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

రేపు బండలాగుడు పోటీలు

సికెదిన్నె, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఈనెల 21న బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఊటుకూరు కోదండరామస్వామి విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నారు. ఓల్డ్ కేటగిరీ ఎద్దుల బండలాగుడు పోటీల్లో మొదటి బహుమతి రూ.40వేలు, రెండో బహుమతి రూ.30 వేలు, మూడో బహుమతి రూ.20 వేలు, 4వ బహుమతి రూ.10 వేలు, 5వ బహుమతి రూ.5 వేలు, 6వ బహుమతి రూ.3 వేలు అందించనున్నట్లు తెలిపారు. 20వ తేదీ యాగశాల, యజ్ఞయాగాదులు, 21న హోమాలు, ప్రత్యేక పూజలు, 22 విగ్రహ ప్రతిష్ఠ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం 12 గంటలకు అన్నదానం చేస్తున్నట్లు తెలిపారు.

ఆటో ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలు

చెన్నూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కొక్కిరాయపల్లె వెళ్లే దారిలోని బయోమాస్‌ప్లాంటు వద్ద మంగళవారం ఆటో ఢీకొనడంతో రామాంజనేయులు తీవ్రంగా గాయపడ్డాడు. రామాంజనేయులు వ్యక్తిగత పని నిమిత్తం కొక్కిరాయపల్లె నుంచి బైక్‌లో చెన్నూరుకు వస్తుండగా ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొంది. ఈ సంఘటనలో రామాంజనేయులు కాళ్లు, శరీరంపై తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రున్ని చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

ఎక్స్‌కవేటర్లు, ట్రాక్టర్లు స్వాధీనం

నందలూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): టంగుటూరు సమీపంలోని చెయ్యేరులో అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ఎక్స్‌కవేటర్లు, 5 ట్రాక్టర్లను మంగళవారం పెనగలూరు ఎస్ఐ రవిప్రకాష్‌రెడ్డి స్వాధీనం చేసుకున్నారు.కేసు నమోదు చేసి ఉన్నతాధికారుల సూచన మేరకు చర్యలు తీసుకుంటామని వివరించారు. స్వాధీనం చేసుకున్న వాటిని నందలూరు పోలీసుస్టేషన్‌లో అప్పగించారు.

సిద్దవరంలో 150 మామిడి మొక్కల నరికివేత



నరికేసిన మామిడి మొక్కలు

పెనగలూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పాత కక్షల నేపథ్యంలో రెండేళ్ల వయసున్న 150 మామిడి మొక్కలను సోమవారం ఉదయం నరికివేసినట్లు ఎస్ఐ రవిప్రకాష్ రెడ్డి తెలిపారు. తిరుమల రాజంపేట హరిజనవాడ వాసి రామాంజనమ్మ ఐదెకరాల్లో రెండేళ్ల కిందట మామిడి మొక్కలు నాటి సంరక్షించుకుంటోంది. అదే గ్రామానికి చెందిన పూలతోట హరి వాటిని నరికివేశాడం టూ లేబాక శ్రీనివాసరెడ్డి ఫిర్యాదు చేశాడన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ప్రీమియం చెల్లింపు నమోదు ప్రారంభం


కామన్ సర్వీస్ సెంటర్‌లో నమోదు ● బ్యాంకు ద్వారానే చెల్లింపు ● డిసెంబరు 15 వరకు గడువు

కడప రూరల్, నవంబర్ 19(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రబీపంటలకు సంబంధించి 2024-25కు పంటల బీమా, ఫసల్ బీమా(పిఎంఎఫ్‌బీవై) పథకాల్లో పంటల వారీగా ప్రీమియం చెల్లింపు నమోదు ప్రారంభమైంది. పంట రుణాలు పొందని రైతులు నేరుగా చెల్లించేందుకు సమీప(సీఎస్‌సీ) కామన్ సర్వీస్ సెంటర్‌లో నమోదు చేసుకోవాలి. పంట రుణ గ్రహీతలు, రైతులు నేరుగా బ్యాంకు ద్వారానే చెల్లించాల్సి ఉంది. రబీలో బ్యాంకు ద్వారా పంట రుణాలను పొందని రైతులు సీఎస్‌సీ ద్వారా ప్రీమియం చెల్లించాలి. నేరుగా ప్రీమియం చెల్లించే రైతులు ఆధార్, బ్యాంకు పాస్‌బుక్, పట్టాదారు పాసుబుక్, పంట ధ్రువీకరణ పత్రం, ఆధార్ అనుసంధానమైన మొబైల్ నెంబర్ వివరాలను జతపరుస్తూ నమోదు చేసుకోవాలి. రైతులు స్వయంగా ఎన్‌సీఐపీ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో కూడా నమోదు చేసుకోవడానికి వీలుకల్పించారు. ప్రీమియం చెల్లించడానికి 2024 డిసెంబరు 15వ తేదీ వరకు గడువు కల్పించా రు. ఈ అవకాశాన్ని జిల్లాలోని అర్హులైన రైతు సోదరులంతా సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి నాగేశ్వరరావు పేర్కొన్నారు. నోటిఫైడ్ క్రాప్ రబీ 2024-25కు రైతు వాటా ప్రీమియం ధరలు

సీ.నెం	పంట	బీమాయూనిట్	నష్టపరిహారం	బీమామొత్తం	స్థూలప్రీమియం	సెంట్రల్	రాష్ట్రం	రైతు	హెక్టారుకు	ఎకరాకు
1	వరి	ఎంఐయు	80శాతం	రూ.1050000	3.00 శాతం	0.75	0.75	1.50	రూ. 1575	రూ. 638
2	శనగ	ఎంఐయు	70 శాతం	రూ.80000	17.97 శాతం	8.24	8.24	1.50	రూ. 1200	రూ. 486
3	వేరుశగ	ఎంఐయు	80శాతం	రూ.80000	3.00 శాతం	0.75	0.75	1.50	రూ.1200	రూ. 486
4	జొన్న	ఎంఐయు	80 శాతం	రూ.52500	3.00 శాతం	0.75	0.75	1.50	రూ.787.5	రూ. 319
5	పచ్చిమిర్చి	డీఐయు	80శాతం	రూ.45000	2.00శాతం	0.25	0.25	1.50	రూ.675	రూ. 273
6	బ్లాక్‌గ్రామ్	ఎంఐయు	80శాతం	రూ.47500	6.00 శాతం	2.25	2.25	1.50	రూ.712.5	రూ. 288
7	సీసమ్	ఎంఐయు	80శాతం	రూ.30000	3.00 శాతం	0.75	0.75	1.50	రూ.450	రూ. 182
8	సన్‌ఫ్లవర్	ఎంఐయు	80శాతం	రూ.50000	5.00 శాతం	1.75	1.75	1.50	రూ.750	రూ. 304

సంస్థలను తరలించే పద్ధతికి స్వస్తి పలకాలి

లేదంటే ఉద్యమానికి సన్నద్ధం ● రౌండ్ టేబుల్ సమావేశంలో ఆర్‌సీపీ, సీపీఐ నేతలు




రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న రవిశంకర్‌రెడ్డి

కడప మారుతీనగర్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాయలసీమలో ఏర్పాటైన వివిధ సంస్థలను అమరావతికి తరలించే పద్ధతికి ప్రభుత్వం స్వస్తి పలకాలని రాయలసీమ కమ్యూనిస్టుపార్టీ (ఆర్‌సీపీ) రాష్ట్ర కార్యదర్శి నిమ్మకాయల రవిశంకర్‌రెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర హెచ్చరించారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో రాయలసీమలోని సంస్థలను అమరావతికి తరలించడాన్ని వ్యతిరేకిస్తూ నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్రంలో మిగతా ఏ ప్రాంతానికీ జరగనంత అన్యాయం సీమకు మాత్రమే జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. చెన్నూరు చక్కెర ఫ్యాక్టరీ, కడప పేపర్ మిల్లు, కాటన్ మిల్లు, లంకా కేబుల్, జ్యోతి కెమికల్, నందలూరు ఆల్విన్ ఫ్యాక్టరీ, ప్రొద్దుటూరు పాలకేంద్రం మూసివేస్తూ ఇక్కడి ప్రజల జీవనోపాధిని దెబ్బతీస్తున్న తీరు దారుణమన్నారు. బ్యాంకుల విలీనం పేరుతో కడప ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ అమరావతికి తరలించేలా చేస్తున్న సన్నాహాలు సరైందికాదన్నారు. రూ.250 కోట్ల కేంద్ర నిధులతో కడపలో ఏర్పాటు చేసిన ఎంఎస్‌ఎంఈని సైతం అమరావతికి తరలించేలా జీఓ తీసుకురావడం విడ్డూరంగా వుందన్నారు. కర్నూలులోని మానవ హక్కుల, లోకాయుక్త కార్యాలయం, సీబీఐ కోర్టును కూడా తరలించే ప్రక్రియకు శ్రీకారం చుట్టడం దారుణమన్నారు. 15 ఏళ్ల కిందట కడపలో ఏర్పాటు చేసిన స్టీల్ ప్లాంట్‌కోసం అవసరమైన నిధులు కేటాయింపు చేయకపోగా, పేరుకు మాత్రమే సూపర్ స్పెషాలిటీ అందులో ఒక డాక్టర్‌కూడా వుండరు, పరికరాలుండవని, అంతలా కడపలో వైద్య రంగం భ్రష్టుపట్టిందన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచీ ఒక్క నంద్యాల రైలు మార్గం తప్ప మరో రైలు మార్గం అంటే తెలియని స్థితిలో వున్నామన్నారు. 1983లో తెలుగుగంగ, హంద్రీనీవా, గాలేరు-నగరి సుజల స్రవంతి ప్రాజెక్ట్ నేటికీ అసంపూర్తిగా వుండడం సీమ ప్రజల దౌర్భాగ్యమన్నారు. శ్రీశైలం ప్రాజెక్ట్ నీటిని మినిమం బ్యాలెన్స్ మెయిటెనెన్స్ చేయకుండా వున్న నీటిని తోడేస్తున్న తీరుపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆర్‌సీపీ నగర కార్యదర్శి మగ్బుల్‌బాషా, లోక్‌సత్తా, జనతాదళ్ నాయకులు కృష్ణయ్య, ప్రతాప్‌రెడ్డి, దళిత, గిరిజన హక్కుల పోరాట సంఘం నేతలు వెంకటేష్, ప్రసాద్, రమేష్, ఓబులేసు, తదితరులు పాల్గొన్నారు.

సీమ స్థాయి క్రీడల్లో సత్తా చాటిన గురుకుల విద్యార్థులు

లింగాల, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ స్థాయి జోన్-4 క్రీడల్లో ఇప్పట్ల గురుకుల కళాశాల విద్యార్థులు సత్తా చాటారు. 14 నుంచి 18 వరకు జరిగిన పోటీల్లో సీనియర్ ఇంటర్ విద్యార్థులు డిస్క్ త్రోలో మొదటిస్థానం నిర్మలజ్యోతి, జావెలిన్ త్రోలో తృతీయస్థానం, కె. అనూష, చెస్‌లో ద్వితీయ స్థానం ఎం.శ్రావణి, లాంగ్‌జంప్‌లో నాలుగోస్థానంలో ఎస్.శ్రీవాణి, త్రోబాల్‌లో కె.అనూష టీం రన్నర్స్‌గా నిలిచారు. జూనియర్ ఇంటర్ విభాగంలో వంద మీటర్లు రన్నింగ్‌లో వి.భవ్య ద్వితీయస్థాన, రెండు వందల మీటర్ల రన్నింగ్‌లో వి. భవ్య మొదటి స్థానం, క్యారమ్స్‌లో టి.సింధు, కె.అలేఖ్యలు విన్నర్స్‌గా నిలిచారు. 1500 మీటర్ల ర్నింగ్‌లో టి.షర్మిల తృతీయస్థానంలో నలిచారు. ఈ సందర్భంగా విద్యార్థులందరిని కళాశాల ప్రిన్సిపాల్ సత్యవతమ్మ తదితరులు అభినందించారు.



వంట మనిషి, డ్రైవర్ కావలెను

కడప నగరంలో ప్రముఖ వ్యాపారవేత్త ఇంట్లో పనిచేయుటకు వంట మనిషి, డ్రైవర్ కావలెను. ఆకర్షణీయమైన జీతం ఇవ్వబడును. సెల్ : 96765 93424

Ajc-000

అర్జంటుగా కావలెను

APSRTC రాజంపేట డిపోనందు బస్సులు వాషింగ్ చేయుటకు వాషింగ్ బాయ్స్ కావలెను. ఆకర్షణీయమైన జీతం, రాజంపేట చుట్టు ప్రక్కల వారికి ప్రాధాన్యత సంప్ర : 80080 81149

Ajc-196239

బంగారం కొనబడును

మీబంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మాడబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డు పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ.సంప్ర॥ 7382114647

AJA- 198473

CHANGE OF NAME

I, KALVAPALLE NASWINTH MITHRA (OLD NAME) S/o. KALVAPALLE SURESH KUMAR, R/o. D.NO.76/156, RAMRAJPALLI, KADAPA, YSR Dist., ANDHRA PRADESH, INDIA, do hereby Change My Name to KALVAPALLE VIHAS CHANDRA (NEW NAME).

AJC-000

ఆంధ్రజ్యోతిలో ప్రకటనల కోసం సంప్రదించండి

యూనిట్ కార్యాలయం

9985411183

9985411189

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

బస్సు షెల్టరు లేక ప్రయాణికుల ఇక్కట్లు



వల్లూరు బస్టాండు ప్రాంతంలో బస్ షెల్టరు లేక రోడ్డు పక్కన వేచి ఉన్న ప్రయాణికులు

వల్లూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : వల్లూరులో బస్సు షెల్టరు లేక ప్రయాణికుల ఇక్కట్లు వర్ణనాతీతమయ్యాయి. నిలువ నీడ లేక ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ వారు పడే బాధలు అన్నీఇన్నీ కావు. కడప-తాడిపత్రి హైవేపై బస్సు షెల్టరు కొరత ప్రయాణికులను తీవ్రంగా బాధిస్తోంది. ప్రభుత్వాలు మారినా ప్రజల కష్టాలు తీరడం లేదు. వల్లూరు మండలం నుంచి కట్ట, తప్పెట్ల, కుమారునిపల్లె, కొప్పోలు, వల్లూరు, ఎ.ఓబాయపల్లె, గోటూరు, తోళ్లగంగనపల్లె, రామిరెడ్డికొట్టాలు స్టేజీల నుంచి ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. అయితే కొప్పోలు, గోటూరు స్టేజీలు మినహాయిస్తే ఎక్కడా బస్సు షెల్టర్లు లేవు. మండల కేంద్రమైన వల్లూరు చాలా గ్రామాలకు ప్రధాన కేంద్రం. నిత్యం ప్రయాణికులు బస్సుల కోసం ఎదురు చూస్తుంటారు. వేసవిలో దుకాణాలే ప్రజలకు కొంత వరకు నీడనిస్తుంటాయి. గత ప్రభుత్వంలో దాతల సహకారంతో ప్రయాణికులు కూర్చునేందుకు బెంచ్‌లు ఏర్పాటు చేసినా అవి వైసీపీ సానుభూతిపరులు తమ దుకాణం వద్ద ఏర్పాటు చేసుకోవడంతో అక్కడికి వెళ్లి కూర్చునేందుకు ప్రయాణికులకు కొంత ఇబ్బంది ఏర్పడుతోంది. బస్సు నిలిపేందుకు అనువుగా ట్రాక్ ఏర్పాటు చేశారు. అయితే దుకాణదారులు కొంత మంది ఆ ట్రాక్‌లను ఆక్రమించారు. కాగా గతంలో ప్రయాణికులు, బాటసారుల సౌకర్యం కోసం సత్రాలు నిర్మించారు. తోళ్లగంగనపల్లె, వల్లూరు, కొప్పోలు స్టేజీల వద్ద సత్రాలు ఉండేవి. అయితే రోడ్డు విస్తరణతో అవి కాలగర్భంలో కలిసిపోయాయి. వల్లూరులో వద్ద ఉన్న సత్రం రోడ్డు విస్తరణలోకి వస్తుంది అని ఆర్‌అండ్‌బీ అధికారులు దాన్ని పూర్తిగా తొలగించారు. కానీ ఇటీవల సత్రం కంటే ముందుకు వచ్చి కొంత మంది నిర్మాణాలు చేపట్టారు. షాపింగ్ కాంప్లెక్స్ కూడా నిర్మించి వేలాది రూపాయలు అద్దెలు వసూ లు చేసుకుంటున్నారు. ప్రధాన రోడ్డుపై వచ్చే వాహనాలు వల్లూరు నుంచి వచ్చే వారికి కనిపించకపోవడంతో ప్రమాదాలు జరిగిన సంఘటనలూ ఉన్నాయి. కావున అధికారులు, ప్రజాప్రతినిధులు బస్సుషెల్టరు ఏర్పాటుపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

దాతలు ముందుకు రావాలి

ట్రస్టు పేరుతో ఎన్నో కార్యక్రమాలు చేపడుతున్న దాతలు బస్సు షెల్టరు ఏర్పాటుకు కూడా ముందుకు రావాల్సిన అవసరం ఉంది. ఇందుకు సహకరిస్తే ప్రయాణికులకు నీడకు కల్పించినవారవుతారు.

చిత్రం చెప్పిన సమస్య



కమలాపురం మండలం సి.గోపులాపురంలో గ్రామ పంచాయతీ కార్యాలయం శిథిలావస్థకు చేరుకుంది. భవనం చుట్టూ పిచ్చిమొక్కలు, కంపచెట్లు పెరిగాయి. రేషన్ సరుకులు ఇక్కడి నుంచే పంపిణీ చేస్తున్నారు. రేషన్ సరుకుల కోసం కంపచెట్ల మధ్య నుంచి రావాల్సి వస్తోందని, మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు రాయుడు, ఓబయ్య, బాలిరెడ్డి, శివరామిరెడ్డి, హబీబుల్లా విన్నవించారు. ఈ కార్యాలయానికి కనీసం తలుపు కూడా లేదని, అధికారులు పట్టించుకోవాలని వారు కోరారు. -కమలాపురం, (ఆంధ్రజ్యోతి)

స్వయం సహాయక సభ్యుల పిల్లలకు ఆట వస్తువుల పంపిణీ



ఆట వస్తువులను పంపిణీ చేస్తున్న అధికారులు

కడప ఎన్జీఆర్ సర్కిల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) :కడప టీటీడీసీలోని శిక్షణార్థులకు మంగళవారం ఆట వస్తువులను పంపిణీ చేశారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన స్వయం సహాయక సంఘాల సభ్యుల పిల్లలకు డీఆర్‌డీఏ, సీడాప్ ఆధ్వర్యంలో నైపుణ్యాభివృద్ధిలో భాగంగా డిపార్ట్‌మెంటల్ స్టోర్ మేనేజరు, సేల్స్ అసోసియేట్ రంగంలో శిక్షణ ఇస్తారు. జిల్లాలోని వివిధ గ్రామాల నుంచి సుమారు 70 మంది శిక్షణ పొందుతున్నారు. ఇందులో భాగంగా క్రికెట్ కిట్, వాలీబాల్ తదితర ఆట వస్తువులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ రంగస్వామి, శిక్షణా కేంద్రం ఇన్‌చార్జ్ పృథ్వీరాజ్, ట్రైనర్, శిక్షకులు నవీన్, అనిల్‌కుమార్, శ్రీనాథ్, హరీష్ పాల్గొన్నారు.

ఉక్కు సాధన సదస్సు కరపత్రం విడుదల

కడప ఎర్రముక్కపల్లె, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఉక్కుపరిశ్రమ ఏర్పాటు చేయాలని, కడప- బెంగళూరు రైల్వే పనులు పూర్తి చేయాలని డిసెంబరు 8న జరిగే సదస్సును జయప్రదం చేయాలని అఖిలపక్షం నాయకులు నారాయణరెడ్డి, సీఆర్‌వీ ప్రసాద్, సత్తార్ పిలుపునిచ్చారు. మంగళవారం ఆర్‌ఆర్ కేఫ్‌లో ఉక్కుసాధన సదస్సు కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విభజన చట్టం ప్రకారం జిల్లాలో ఏర్పాటు చేయాల్సిన ఉక్కు పరిశ్రమకు ఏ పార్టీ కూడా చిత్తశుద్ధితో కృషి చేయడం లేదన్నారు. అలాగే ఎన్నో ఏళ్లుగా కడప - బెంగళూరు రైల్వే పనులు జరగడంలేదని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ తీసుకుని త్వరితగతిన పనులు పూర్తి చేయాలన్నారు. అఖిలపక్షం నాయకులు గురప్ప, సుబ్బరాయుడు, జయవర్ధన్, శంకర్, రవిశంకరరెడ్డి, ఎస్.రాజేంద్రప్రసాద్, అంజనేయులు పాల్గొన్నారు.

'ఇందిరమ్మ రాజ్యం కాంగ్రెస్‌తోనే సాధ్యం'

పులివెందుల టౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ రాజ్యంకాంగ్రెస్‌తోనే సాధ్యమని పులివెందుల నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ ధ్రువకుమార్‌రెడ్డి, పులివెందుల మండల అధ్యక్షుడు అనిల్ కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పులివెందులలో ఇందిరమ్మ 107వ జయంతి ని కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ ధ్రువకుమార్‌రెడ్డి, పులివెందుల మం డలాధ్యక్షుడు అనిల్‌కుమార్‌రెడ్డి మాట్లాడారు. ఇందిరమ్మ గొప్ప పరిపాలనాదక్షురాలన్నారు. లింగాల, చక్రాయపేట, తొండూరు, సిం హాద్రిపురం, పులివెందుల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విత్తన పంపిణీ పరిశీలన

వీరపునాయునిపల్లె, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి):కొమ్మద్ది రైతు సేవా కేంద్రంలో జరుగుతున్న వేరుశనగ విత్తన పంపిణీని ఏడీ నరసింహారెడ్డి పరిశీలించారు. మంగళవారం ఆయన ఏఈఓతో కలిసి పరిశీలించారు.

PUBLIC NOTICE

Under the instructions from my client M/s Shriram Finance Limited, Pulivendula Branch I issue the following notice. My client company intends to grant a loan facility to **Sri Shaik Ibrahim** S/o **S. Jamal Basha** residing at D.No. 13/218-v-1/4, Imam Nagar, Vempalle Village, Post & Mandal, YSR Kadapa District under equitable mortgage by way of deposit of title deeds in respect of the schedule mentioned property. Hence the public at large banks & financial institutions are any individual money lenders are hereby informed that if any objections regarding the said loan property, the public shall inform in writing within Five days from the date of this notice for the below mentioned property, otherwise it shall be deemed that there are no objections from anybody and any objections received after Five days will not binding upon my client a company for the below mentioned schedule property. **Schedule :** YSR Kadapa District, Kadapa registration district, Veerapunayunipalle Mandal, Thangedupalle Grama Panchayat board, Thangedupalle Village fields, S.No.s 346/A1, 346/A2, 345/B, out of these survey numbers measuring 1083 Sq. yards out of it 142. 1/2 Sq. yards comprise 15 cubits width of open site in plot no. B6, within the following **Boundaries :** East - Plot No. B7 open site, West - Rastha, North - 20 cubits of open site in Plot No. B6 belongs to Avula Gowri Priya, South -15 cubits of open site in Plot No. B6 belongs to Gali Ravi Kumar **In between Measuring - Open Site** : East-West : 19 yards or 38 cubits or 17.29 meters, North-South : 7.1/2 yards or 15 cubits or 6.82 meters total measruing 142.1/2 Sq. yards or 119.70 Sq. Meters comprise open site full.

A. PRATHAP REDDY
ADVOCATE, PULIVENDULA

PUBLIC NOTICE

Under the instructions from my client M/s Shriram Finance Limited, Pulivendula Branch I issue the following notice. My client company intends to grant a loan facility to **Sri Gudemcheruvu Sai Umesh** S/o **Raman Kumar** residing at D.No. 1/3/413, Chennareddy Colony, Pulivendula Town, YSR Kadapa District under equitable mortgage by way of deposit of title deeds in respect of the schedule mentioned property. Hence the public at large banks & financial institutions are any individual money lenders are hereby informed that if any objections regarding the said loan property, the public shall inform in writing within Five days from the date of this notice for the below mentioned property, otherwise it shall be deemed that there are no objections from anybody and any objections received after Five days will not binding upon my client a company for the below mentioned schedule property. **Schedule :** YSR Kadapa District, Kadapa registration district, Pulivendula Sub-District, Pulivendula Municipal area, Pulivendula Village fields, S.No. 25, Pulivendula Town Chennareddy Colony, house bearing D.No. 1-3-413 comprise R.C.C. roof namuna house within the following **Boundaries :** East - House of Koduru Ramalakshumma, West - House bearing D.No.1-3-414, North - 10 cubits rastha, South - Open site of Thugutla Lakshumma. **In between Measuring - Open Site** : East-West : 10 cubits or 15 feet or 4.572, North-South 40 cubits or 60 feet or 18.288 meters (100 Sq. yards) comprised open site. **House Measuring :** East-West 15 feet or 4.572 meters, North-South 60 feet or 18.288 meausres comprise R.C.C. roof house full.

A. PRATHAP REDDY
ADVOCATE, PULIVENDULA

ఘనంగా పురుషుల దినోత్సవం

కడప ఎర్రముక్కపల్లె, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : కడప నగరం పాత రిమ్స్ అల్‌షిఫా కేంద్రంలో మంగళవారం అంతర్జాతీయ పురుషుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అల్‌షిఫా డైరెక్టర్ ఎస్.మహ్మద్ రఫి, కేకేఆర్ అధ్యక్షుడు తారిఫ్, ఎస్‌ఆర్‌బీ అధ్యక్షుడు ప్రదీప్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో పురుషుల హక్కులపై మాట్లాడారు. అనంతరం ముఖ్యఅతిథులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది పర్వీన్‌నాజ్, ఉదయశ్రీ, సైకాలజిస్ట్ సునీత, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పరిశుభ్రతే ఆరోగ్యానికి రక్ష

సికెదిన్నె, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పరిశుభ్రతే ఆరోగ్యానికి రక్ష అని ఎంపీడీఓ కుళాయిబాబు తెలిపారు. చింతకొమ్మదిన్నె మండలం బుసిరెడ్డిపల్లె గ్రామంలో మంగళవారం వరల్డ్ టాయిలెట్‌డే సందర్భంగా గ్రీన్ అంబాసిడర్లకు సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశుభ్రతలో గ్రీన్ అంబాసిడర్లు ఎంతో ప్రముఖ పాత్రపోషిస్తున్నారని, వారి సేవల ద్వారానే పరిశుభ్రత నెలకొని ప్రజలు ఆరోగ్యంగా ఉంటున్నారన్నారు. అటువంటివారి సేవలను గుర్తించాలన్నారు. కార్యక్రమంలో ఈవోఆర్‌డీ పి.వి.సుబ్బారెడ్డి, ఎంపీటీసీ వెంకటరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, పీఆర్‌ఏఈ, నాయకులు రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నీటి సంఘం ఎన్నికల సిబ్బందికి శిక్షణ

సింహాద్రిపురం, నవంబరు (ఆంధ్రజ్యోతి): పీబీసీ ఆయకట్టు కింద జరగబోయే నీటి సంఘం ఎన్నికల నిర్వహణలో భాగంగా సింహాద్రిపురం ఎంపీడీఓ కార్యాలయ సభాభవనంలో మంగళవారం పీఓలకు, ఏపీఓలకు శిక్షణ ఇచ్చారు. నియమావళి ప్రకారం ఎన్నికలు ఎలా నిర్వహించాలి అనే విషయాలపై వివరించారు. తహసీల్దార్ నాగేశ్వర్‌రావు, ఎంపీడీఓ కార్యాలయ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ శ్రీనివాసరెడ్డి, డీటీ హరిబాబు, ఏఓ శివమోహన్‌రెడ్డి, ఇరిగేషన్ ఏఈ సుబాన్, రెవెన్యూ సిబ్బంది, సింహాద్రిపురం, కొండాపురం మండలాల సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

'హిందువుల మనోభావాలను దెబ్బతీయడం తగదు'

వేంపల్లె, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): హీరో రామ్‌చరణ్ అయ్యప్పమాల ధరించి కడప దర్గాకు వెళ్లడం హిందువుల మనోభావాలు దెబ్బతీయడమేనని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గాలి హరిప్రసాద్ విమర్శించారు. హిందువులకు రామ్‌చరణ్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

చిచ్చుపెడుతున్న అగ్రవర్ణాలపై చర్యలు తీసుకోవాలి

- ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండు వీరయ్య



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండు వీరయ్య

పులివెందుల రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): దళితుల మధ్య చిచ్చుపెడుతున్న అగ్రవర్ణాలపై పోలీసులు చర్యలు తీసుకోవాలని ఏపీఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండువీరయ్య డిమాండ్ చేశారు. దాడిలో గాయపడ్డ కృష్ణమూర్తిని మంగళవారం ఆయన పరామర్శించారు. అనంతర మాట్లాడుతూ ఇటీవల సింహాద్రిపురం మండలం బలపనూరు గ్రామానికి చెందిన ముమ్మె భార్గవ, ఆయన తండ్రి వెంకటరమణలపై గజ్జల చంద్రశేఖర్‌రెడ్డి దాడి చేశారన్నారు. దీనిపై సింహాద్రిపురం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైందన్నారు. కేసు నమోదు వెనుక అదే గ్రామానికి చెందిన కృష్ణమూర్తి ఉన్నాడనే కారణంతో తన అనుచరుడుగా ఉన్న చిన్న ఓబయ్య అనే వ్యక్తితో దాడిచేయించారన్నారు. సోమవారం రాత్రి బలపనూరు గ్రామంలో జరిగిన ఓ కార్యక్రమానికి హాజరైన కృష్ణమూర్తిపై చిన్నఓబయ్య కట్టెతో దాడి చేసి గాయపరిచాడన్నారు. చిన్నఓబయ్యకు, కృష్ణమూర్తికి ఎటువంటి విరోధం లేదన్నారు. కేవలం తనపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదైందనే కారణంతో గజ్జల చంద్రశేఖర్‌రెడ్డి చిన్నఓబయ్యను ఉసిగొలిపి దాడి చేయించారని తేలిందన్నారు. దళితులు ఐక్యంగా ఉండకూడనే దురుద్దేశంతో ఈ దాడి చే యించారని, దీనిపై పోలీసు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరా రు. ఈ కార్యక్రమంలో డప్పు, చర్మకళాకారుల రాష్ట్ర కన్వీనర్ నాగభూషణం, జిల్లా ఉపాధ్యక్షుడు రామయ్యగారి కృష్ణమూర్తి, సూర్యనారాయణ, బాలనరసింహులు, అంజి, మహేష్, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

విద్య ద్వారా మహిళా సాధికారత

కడప కల్చరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): విద్య ద్వారా మహిళా సాధికారత సాధ్యమని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వేముల సలీంబాషా పేర్కొన్నారు. గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం డిగ్రీ కళాశాలలో మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల్లో అక్షరాస్యతా స్థాయి, అవగాహన పెరగడంతో సమాజం విద్యకు ప్రాధాన్యత ఇస్తోందన్నారు. స్టెప్ సీఈఓ సాయిగ్రేస్ మాట్లాడుతూ మేధాశక్తి పురుషులకంటే మహిళల్లోనే ఎక్కువగా ఉంటుందన్నారు.

ప్రకృతి వ్యవసాయం పంటలను పరిశీలించిన ఏఓ



పత్తి పంటను పరిశీలిస్తున్న ఏఓ ఓబులేసు

పెండ్లిమర్రి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇసుకపల్లె, చెన్నంరాజుపల్లె గ్రామాల్లో ప్రకృత వ్యవసాయం ద్వారా సాగుచేసిన పంటలను మండల వ్యవసాయాధికారి ఓబులేసు పరిశీలించారు. పొలంపిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా పత్తి పంటను పరిశీలించారు. నీమాస్త్రం ఉపయోగాలను వివరించి సూచనలు, సలహాలు ఇచ్చారు. గ్రామ వ్యవసాయ సహాయకురాలు చిట్టి, నాగలక్ష్మి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

రైతులు స్వయంగా పంటల బీమాను చెల్లించుకోవచ్చు

కమలాపురం రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రైతులే స్వయంగా పంటల బీమా రుసుం చెల్లించవచ్చని వ్యవసాయ అధికారి సరస్వతి తెలిపారు. మంగళవారం కమలాపురం మండలపరిధిలోని నల్లింగాయపల్లె, తురకపల్లె గ్రామాల నందు మండల వ్యవసాయాధికారి ఎం.సరస్వతి ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో డీడీఏ రమణారెడ్డి, ఎఆర్‌ఎస్ సైంటిస్ట్ మాధురి, ఏవో పద్మజా, మరియు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది వెంకటరామిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వివిధ పంటల్లో విత్తన శుద్ధి తప్పనిసరిగా చేసుకోవాలన్నారు. ప్రతి పంటకు, లింగాకర్షక బుట్టలు, జిగురు అట్టల వాడకం గురించి మరియు వాటి ఉపయోగాలను రైతులకు వివరించారు.

స్వామియే.. శరణం అయ్యప్ప



అయ్యప్ప స్వామి భక్తులకు భిక్ష ఏర్పాటు చేసిన హరినాథ్

పులివెందుల టౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) :పులివెందుల పట్టణంలోని మిట్టమల్లేశ్వర దేవస్థానం వద్ద మంగళవారం మధ్యాహ్నం అయ్యప్ప స్వాములకు రియల్ ఎస్టేట్ వ్యాపారి కొమెర హరినాథ్ భిక్ష ఏర్పాటు చేశారు. హరినాథ్ ఆయన సతీమణి లక్ష్మీదేవి అయ్యప్ప స్వాములకు భిక్ష ఏర్పాటు చేసి స్వాములకు వడ్డించారు. ఈ సందర్భంగా హరినాథ్ దంపతులను అయ్య ప్ప భక్తమండలి ఆధ్వర్యంలో వేద పండితులు రుద్ర స్వామి, గురుస్వామి శివారెడ్డి అభినందించారు. హరినాథ్ కుటుంబ సభ్యులు కొమెర వెంకటకుళాయప్ప, శిరీష, వెంకట్‌లక్ష్మి, అయ్యప్పస్వాములు పాల్గొన్నారు.

నేడు అయ్యప్ప స్వామి ఆలయ వార్షికోత్సవం

సింహాద్రిపురం, నవంబరు 19: సింహాద్రిపురంలో వెలసిన అయ్యప్పస్వామి ఆలయ నాలుగో వార్షికోత్సవం బుధవారం నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు అయ్యప్ప భక్త మండలి సంఘం నిర్వాహకులు తెలిపారు. భక్తులు పాల్గొని అయ్యప్ప స్వామి ఆశీస్సులు పొందాలని కోరారు.

పనులు త్వరగా పూర్తి చేయాలి: కమిషనర్

కడప ఎర్రముక్కపల్లె, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ బస్టాండు నుంచి జిల్లా కోర్టు వరకు జరుగుతున్న డ్రైనేజీ పనులు నాణ్యత లోపం లేకుండా త్వరితగతిన పూర్తి చేయాలని కమిషనర్ మనోజ్‌రెడ్డి ఆదేశించారు.మంగళవారం డ్రైనేజీ పనులను ఆయన పరిశీలించారు. అలాగే అంబేడ్కర్ సర్కిల్ నుంచి రైల్వేస్టేషన్ వెళ్లే మార్గం వద్ద డ్రైనేజీ పనులను పరిశీలించారు. ఈఈ ధనలక్ష్మి, డీఈ వేణుగోపాల్, టౌన్‌ప్లానింగ్ అధికారి రత్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మహాశివుడికి ఆరుద్ర నక్షత్ర బిళ్వార్చన పూజలు



చెన్నూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసంలో పవిత్రమైన క్రిష్ణపక్ష చవితి ఆరుద్ర నక్షత్రం పరమశివుడికి ఎంతో ప్రీతికరం కాబట్టి మంగళవారం తెల్లవారుజాము నుంచి స్థానిక మల్లేశ్వరాలయంలో విశేష అభిషేకాలు పూజలు నిర్వహించారు. అలాగే సంకట చతుర్థి సందర్భంగా ఆలయంలోని మూలవిరాట్ విఘ్నేశ్వరుడికి పూజలు చేశారు.

VEHICLES FOR SALE		
VEHICLE NO.	VEH. DISCRIPTION	MODEL
AP39TT0166	M&M ALFA PLUS BS6	2021
AP26TB5348	M&M BOLERO CAMPER ZX	2012
AP10AR9255	INNOVA VA EURO 3.25 G	2009
AP04TX1330	ALDOST PLS	2015

AUCTION DATE 20.11.2024
SHRIRAM AUTO MALL INDIA LTD
GOSULA CIRCLE, OPP. DEVUNI KADAPA ARCH, RAJAMPETA BYPASS ROAD, KADAPA DIST.
CONT. : .98499 81558

క్లాప్ మిత్రలకు సత్కారం

పెండ్లిమర్రి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): వరల్డ్ టాయిలెట్ డే సందర్భంగా నందిమండలం గ్రామ పంచాయతీలోని క్లాప్‌మిత్రలను మంగళవారం సత్కరించారు. జిల్లా పంచాయతీ అధికారి ఆదేశాల మేరకు ఎంపీడీఓ, ఈఓపీఆర్‌డీ, ఏఈ ఆర్‌డబ్ల్యూఎస్, టీడీపీ నాయకులు శ్రీనివాసులరెడ్డి, పంచాయతీ కార్యదర్శులచే సత్కరించారు. యూనిఫాం, గ్లౌజులు ఇచ్చారు. ఈ కార్యక్రమలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఏపీజీబీ ప్రధాన కార్యాలయాన్ని తరలించరాదు

కమలాపురం రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయాన్ని అమరావతికి తరలించేందుకు కూటమి ప్రభుత్వం చేస్తున్న ఏర్పాట్లను సత్వరమే ఉపసంహరించుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కామనూరు శ్రీనివాసులరెడ్డి కోరారు. ఈ మేరకు మంగళవారం వారు ఏపీజీబీ ఎదుట నిరసన తెలిపారు.

అమరావతికి ఏపీజీబీ తరలింపు దారుణం: డీవైఎఫ్‌ఐ

కడప సెవెన్‌రోడ్స్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయాన్ని తరలించాలనుకోవడం దారుణమని డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ తెలిపారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలోని ప్రధాన కార్యాలయాలను తరలింపు చర్యలు చేపడుతన్నారన్నారు. వెంటనే ప్రాంత వివక్షత మానుకోవాలని అన్నిప్రాంతాల అభివృద్ధికి పాటుపడాలన్నారు.

రాష్ట్రంలో దుర్మార్గపు పాలన : వైసీపీ



సెంట్రల్ జైలు వద్ద మాట్లాడుతున్న వైసీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి

కడప క్రైం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో దుర్మార్గపు పాలన సాగుతోందని వైసీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా అన్నారు. సోషల్ మీడియాలో అసభ్యకరమైన పోస్టులు పెట్టి ఇటీవల అరెస్టు అయ్యి కడప కేంద్ర కారాగారంలో రిమాండులో ఉన్న వర్రా రవీంద్రారెడ్డిని మంగళవారం వారు పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడు తూ వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులపై కక్ష గట్టి వందల కేసులు నమోదు చేశారని ఆరోపించారు. ప్రస్తుత ప్రభుత్వం ఏర్పాటై ఆరు నెలలు అవుతున్నా ఎక్కడా సంక్షేమం కనిపించకపోవడంతో కొంతమంది సోషల్ మీడియాలో వారి బాధను వ్యక్తం చేస్తే అలాంటి వారిపై కూడా ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి అరెస్టు చేస్తున్నారన్నారు. అధికారులు కూడా నాయకులకు వత్తాసు పలకడం సరికాదని, తగిన మూల్యం చెల్లించుకోవాల్సింది వస్తుందని హెచ్చరించారు. త్వరలో జమిలి ఎన్నికలు జరుగుతాయని అప్పుడు తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందన్నారు.

స్విమ్మింగ్ పోటీలను ప్రారంభించిన స్పోర్ట్స్ స్కూల్ ప్రత్యేకాధికారి

కడప స్పోర్ట్స్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక స్పోర్ట్స్ స్కూల్‌లో మంగళవారం సబ్ జూనియర్- జూనియర్ స్విమ్మింగ్ పోటీలు నిర్వహించారు. వైఎస్‌ఆర్ స్పోర్ట్స్ స్కూల్ ప్రత్యేకాధికారి జగన్నాథరెడ్డి వీటిని ప్రారంభించారు. విజేతలు డిసెంబర్ 7, 8, తేదీల్లో విశాఖపట్నం ఆక్వా స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరిగే పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందని స్విమ్మింగ్ జిల్లా సెక్రటరీ రాజశేఖర్ తెలిపారు. బాలుర విభాగంలో యశ్వంత్, కార్తికేయ దేవరాయల్, నాగవర్ధన్, జ్ఞాన్ అభిషేక్, లక్ష్మీనారాయణ, త్రిభువన్‌రెడ్డి, మాధవ, షణ్ముఖ్, వెంకటసాయి, వెంకటశ్రీరామ్, ఆదిశేషారెడ్డి విజయం సాధించారు. బాలికల విభాగంలో మోక్షప్రియ, షేక్ ఆల్ అమీన్ విజేతలుగా నిలిచారు.

పరిసరాల పరిశుభ్రత ఆరోగ్యానికి భద్రత

వల్లూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : పరిసరాల పరిశుభ్రత మన ఆరోగ్యానికి భద్రత అని ఎంపీడీఓ రఘురాం అన్నారు. మంగళవారం వరల్డ్ టాయిలెట్స్‌డే సందర్భంగా వల్లూరులో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో రోడ్లన్నీ పరిశుభ్రంగా ఉంచుకోవలసిన బాధ్యత ప్రజలపై ఉందని, పరిసరాలు బాగుంటే దోమలు చేరకుండా ఉంటాయన్నారు.



కడప నగరం బిల్టప్ సర్కిల్ సమీపంలో గల విజయదుర్గాదేవి సన్నిధిలో మంగళవారం రాహుకాల పూజలు ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి దినపత్రికలో...

ప్రారంభోత్సవం
జన్మదిన శుభాకాంక్షలు
ప్రమాణస్వీకారం
వివాహ మహోత్సవం
ఉద్యోగ విరమణ
విదేశీయానం
స్వదేశాగమనం

ఇప్పుడు ఆంధ్రజ్యోతి దినపత్రిక ద్వారా మీ ఆత్మీయులకు ప్రకటనలతో మరింత చేరువకండి, అందుకు మీ ప్రాంతంలోనే మా ప్రకటనల ప్రతినిధి అందు బాటులో ఉన్నారు సంప్రదించండి.

పొలిటికల్ యాడ్స్
షష్టిపూర్తి మహోత్సవం
సినిమా యాడ్స్
శ్రద్ధాంజలి
లీగల్ యాడ్స్
ప్రభుత్వ ప్రకటనలు
క్లాసిఫైడ్స్

యూనిట్ కార్యాలయం
సర్వే నెం. 137 & 138/3, చిన్నమాచుపల్లె చెన్నూరు మండలం, కడప.
Cell: 9985411183, 9985411193, 9985411189.

ప్రాంతీయ కార్యాలయాలు :
కడప: Cell : 99854 11192, 99854 10691, 99854 02134
కమలాపురం : 9985411183 ప్రొద్దుటూరు : 9985921354, పులివెందుల : 9985411183
జమ్మలమడుగు : 9985401296 మైదుకూరు : 7989603861 రాజంపేట : 9985411193
రాయచోటి: 9985411193 బద్వేలు: 9985921375 కోడూరు : 9985411193

ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక
ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు, పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.
కడప - C.O.: 99854 04960
పులివెందుల - S.R.: 95812 61647
A.C.M.: 99854 11184

నూతన బస్సును ప్రారంభించిన భూపేశ్‌రెడ్డి



జమ్మలమడుగు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి):జమ్మలమడుగు ఆర్టీసీ డిపోలో మంగళవారం జమ్మలమడుగు టు చెన్నై నూతన ఆర్టీసీ బస్సును టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి ప్రారంభించారు. ముందుగా ఆర్టీసీ కార్మికులు డిపో మేనేజర్ ప్రవీణ్, అసిస్టెంట్ మేనేజర్ పెద్దిరాజు, యూనియన్ కార్మికులు ఘనంగా స్వాగతం పలికారు. పూలమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రమణారెడ్డి, మల్లికార్జున, పొన్నతోట శ్రీను, గ్యారేజీ వల్లి, శివుడు, సుధాకర్, ఎన్ఎంయూ అధ్యక్షుడు బ్రహ్మం, తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగుల ఇసుక విధులను ఆన్‌డ్యూటీగా పరిగణించాలి

ప్రొద్దుటూరు టౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): సచివాలయ ఉద్యోగులకు కలెక్టర్ కార్యాలయం ఇసుక విధులు కేటాయించిందని, ఆ విధులను ఆన్‌డ్యూటీగా పరిగణించాలని ఆంధ్రప్రదేశ్ గ్రామ, వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పెద్దమస్తాన్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సచివాలయ ఉద్యోగులకు బయోమెట్రిక్ ద్వారా జీతాలు చెల్లిస్తోందని తెలిపారు. వారికి ఇసుక విధులు కేటాయించడంలో సచివాలయానికి, ఇసుక రీచ్‌ల మధ్య దాదాపు 15-20 కి.మీ. దూరం ఉందని, దీనితో సచివాలయానికి వెళ్లి బయోమెట్రిక్ వేయడానికి ఇబ్బందిగా ఉందన్నారు. అలాగే మహిళా ఉద్యోగులకు ఇసుక విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు.

ఆధార్ కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి

ఎర్రగుంట్ల, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఎర్రగుంట్ల మండలంలో ఏర్పాటు చేసిన ఆధార్ క్యాంపు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో వెంకటరమణయ్య ప్రజలను కోరారు. మంగళవారం ఆయన ఆధార్ కేంద్రాలను పరిశీలించారు. ఆధార్ నమోదు, నెంబర్‌తో మొబైల్‌లింక్, కార్డులో చిరునామా మార్పులు చేర్పులు, కార్డు ఫింగర్ ప్రింట్స్ తదితర వాటిని అన్ని క్యాంపు కేంద్రాల్లో సవరిస్తున్నట్లు ఆయన తెలిపారు. 19వ తేదీ నుంచి 29వ తేదీ వరకు ఈ క్యాంపు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

రైతుల పొలాలకు రహదారులపై పరిశీలన

బద్వేలు ఆర్డీవో చంద్రమోహన్

అట్లూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎర్రబల్లె, ముత్తుకూరు గ్రామాల రైతుల పొలాలకు వెళ్లేందుకు రహదారులపై ఫిర్యాదులు మేరకు మంగళ వారం బద్వేలు ఆర్డీవో చంద్రమోహన్ పరిశీలించారు. బద్వేలు మండలానికి చెందిన అప్పరాజుపేట గ్రామానికి చెందిన పూలు శంకరయ్య తన పొలానికి దారి లేదంటూ ఫిర్యాదు చేయడంతో ఎర్రబెల్లి పొలం ప్రభుత్వ భూమిలో 266 సర్వేనెంబరులో ప్రభుత్వ భూమి ఉండగా ఆ భూమిలో దారి ఏర్పాటు చేసేందుకు ఆర్డీవో పరిశీలించారు. ఆర్డీవో పరిశీలించి దానిపై నివేదికలు ఇవ్వాలని తహసీల్దారు సుబ్బలక్ష్మిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు శిరీష, ఆర్ఐ రమణ, సర్వేయరు మౌనిక, నరసింహారెడ్డి, వీఆర్వో సుబ్బన్న, వెంకటసుబ్బమ్మ రైతులు ఉన్నారు.

లారీ..ట్రాక్టర్ ఢీ : తప్పిన ప్రమాదం

బద్వేలుటౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : లారీ, ట్రాక్టర్ ఢీ కొనడంతో ట్రాక్టర్ రెండుభాగాలుగా విడిపోయింది. కానీ ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు. మంగళవారం తెల్లవారుజామున ఈ విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం కలగకుండా ఎక్స్‌కవేటర్‌తో ట్రాక్టర్‌ను పక్కకు తొలగించి, లారీని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేశారు.

అధికారుల తీరు మారలే...

కొర్రపాడు సచివాలయం, మరో భవనం పై జగన్ ఫొటోలు దర్శనం



ముద్దనూరు నవంబరు19 (ఆంధ్రజ్యోతి):కొత్త ప్రభుత్వం ఏర్పడి దాదాపు 5నెలలు కావస్తోంది.కానీ అధికారుల తీరు మారలే...ముద్దనూరు మండలం కొర్రపాడు గ్రామ సచివాలయం,మరో ప్రారంభం కాని కార్యాలయ భవనంపై మాజీ సీఎం జగన్మోహనరెడ్డి ఫొటోలు ఇప్పటికీ దర్శనం ఇస్తున్నాయి. ప్రజలు సచివాలయంపై నున్న జగన్ ఫొటోలు చూసి పలు విమర్శలు చేస్తున్నారు.

PUBLIC NOTICE

Under the instruction my client M/s Shriram Finance Ltd., Badvel Branch, rep. by its Manager, the public is nodified as follows: **Puram Balakrishna** S/o **Pedda Siddaiah,** r/o D.No. 7/529, Vinayaka Nagar, Porumamilla Town, Kadapa Dt. has applied for loan to our firm and after going through documents of her right over the below mentioned property, my client-firm decided to grant loan to her. If anybody has got any righ/possession and title over the property or if any litigation is pending in any Court of Law, it shall be brought to the notice of my client, with documentary proof, within A Week from the date of this notice, failing which my client will disburse the loan amount. Any objections received after five days, they will not be taken into account. Particulars of Property : Kadapa Dt, Badvel Sub-District, Porumamilla Mdl. Rangasa-mudram village fields, Sy. No. 1098, house bearing D.No. 7/145B, Boundaries : East - 30 Links Width Road, South - site of Dachuri Parvathamma, West - Site of Dachuri Parvathamm, North - Site of Puram Sujatha. Measurements of Site: East - West - 55 Feet (16.68 Mtrs.) North - South - 23.76 Feet (7.19 Mtrs.) -Totalling to 145.2 Sq. Yards in which house constructed with all easement rights

P.RAJESWARA RAO
ADVOCATE, BADVEL.

ముందే సిబ్బంది కొరత..

ఆపై సమయానికి పాతర...

● మిథ్యగా మారిన సర్కారు వైద్యం

ఆంధ్రజ్యోతి విజిట్

బద్వేలు, నవంబరు19 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలన్న సంకల్పంతో ప్రభుత్వం వైద్యశాలను ఏర్పాటు చేసింది. అవసరమైన సౌకర్యాలు కల్పించి మందులు అందుబాటులో ఉంచినా వైద్యులు, వైద్యసిబ్బంది కొరత ఉన్నా ఎవరూ సమయ పాలన పాటించకపోవడంతో సర్కారు వైద్యానికి జబ్బు చేసింది. పేదలకు ప్రభుత్వ వైద్యం మిథ్యగా మారింది. నియోజక వర్గంలో మంగళవారం ప్రభుత్వాసుపత్రులలో ఆంధ్రజ్యోతి విజిట్ చేసింది. ఈ విజిట్‌లో ప్రధానంగా వైద్యులు, వైద్య సిబ్బంది కొరత తీవ్రంగా కనిపించింది. అంతేకాదు డాక్టర్లు, వారి సిబ్బంది విధులకు రాకపోవడంతో రోగులు వైద్యం కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి పలుచోట్ల కనిపించింది. ప్రధాన ఆసుపత్రితో పాటు నియోజకవర్గంలో ఆంధ్రజ్యోతి పరిశీలనలో అంశాలు ఈ విధంగా ఉన్నాయి. బద్వేలు ప్రభుత్వా సుపత్రిలో ఓపీ300నుంచి 400 ఉండగా వైద్య సిబ్బంది కొరత వేధిస్తోంది. 12 మంది డాక్టర్లు కు గాను ఆరుగురు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వాసుపత్రిలో వైద్యులు సిబ్బంది సమయపాలన పాటించడం లేదు. మంగళవారం ఆసుపత్రిని పరిశీలించగా డాక్టర్లు సమయానికి రాకపోవడంతో కుర్చీలు ఖాళీగా కనిపించాయి. పోరుమామిళ్ల ఆసుపత్రిలో 12 మంది డాక్టర్లు ఉండగా , ఇద్దరు గైనకాలజిస్టులు లీవ్‌లో ఉన్నారు. జనరల్ మెడిసిన్ పోస్టు ఖాళీగా ఉంది. జనరల్ సర్జన్ పోస్టు ఖాళీగా ఉంది. చిన్న పిల్లల డాక్టర్ లీవ్‌లో ఉన్నారు.మరో డాక్టర్ పోస్టు ఖాళీగా ఉంది. ఒక స్టాఫ్‌నర్సు పోస్టు ఖాళీగా ఉంది. ఇక్కడ ప్రతి రోజూ 300 మందికి పైగా ఓపీ ఉంది. గోపవరం ప్రభుత్వాసుపత్రిలో సిబ్బంది కొరత ఉంది. బి.కోడూరు, అట్లూరు, కలసపాడు, ప్రభుత్వ ఆసుపత్రులలో సిబ్బంది కొరత స్పష్టంగా కనిపిస్తోంది. కాశినాయన మండలంలోని నరసా పురం ప్రభుత్వ ఆసుపత్రిలో ఇద్దరు డాక్టర్లు ఉండగా ఒకరు 104కు వెళ్లగా మరొకరు ఆసుపత్రిలో వైద్య సేవలందిస్తున్నారు.

ఇక్కడ 70 నుంచి100 వరకు ఓపీ ఉంటుంది. స్టాఫ్‌నర్సు, ఫార్మాసిస్టు, అటెండర్, నైట్ వాచ్‌మెన్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అట్లూరు మండలం కొండూరు విలేజ్ క్లినిక్ సెంట ర్ భవన నిర్మాణం పూర్తి అయ్యి 2 సంవత్సరాలు కావస్తున్నా నిరుపయోగంగా ఉంది. ఆ సెంటర్ పరిధిలో పేదలకు వైద్యం కరువైంది.





బద్వేలు ప్రభుత్వాసుపత్రిలో డాక్టర్ లేకపోవడంతో ఖాళీగా ఉన్న కుర్చీ, అట్లూరులో నిరుపయోగంగా ఉన్న విలేజ్ క్లినిక్ సెంటర్



పోరుమామిళ్ల ప్రభుత్వాసుపత్రిలో వైద్యం కోసం వేచి ఉన్న రోగులు

పెట్రోల్ బంకు ఏర్పాటుకు స్థల పరిశీలన

ముద్దనూరు నవంబరు19(ఆంధ్రజ్యోతి): మండలంలో పెట్రోల్ బంకుల ఏర్పాటుకు స్థలాన్ని మంగళవారం ఆర్డీవో ఆదిమూలపు సాయిశ్రీ పరిశీలించారు.మంగపట్నం, చిన్నదుద్యాల, ఉప్పలూరు గ్రామ పొలాల్లో పెంట్రోల్ బంకులు ఏర్పాటు చేసుకొనేందుకు దరఖాస్తులు చేసుకున్నారు.ల్యాండ్ కన్వర్షన్ నిమిత్తం ఆర్డీవో భూములను పరిశీలించారు.ఈ కార్యక్రమంలో తహసీల్దారు వరదకిశోర్‌రెడ్డి, సర్వేయర్ పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఎర్రగుంట్ల, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): విజయవాడ విద్యుత్ సౌధలో 22న జరిగే హెచ్‌ఆర్ కమిటీ సమావేశంలో విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఏపీ జెన్‌కో కాంట్రాక్టు కార్మికుల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.రాము ఒక ప్రకటనలో కోరారు. విద్యుత్ సంస్థలు థర్డ్ పార్టీ వ్యవసను రద్దుచేసి సంస్థలోని కాంట్రాక్టు కార్మికులు విలీనం చేసుకొని సంస్థ ద్వారా నేరుగా వేతనాలు ఇవ్వాల న్నారు. ఎన్నో ఏళ్లుగా కాంట్రాక్టు కార్మికులుగానే ఉన్నారని వెంటనే చర్యలు చేపట్టాలన్నారు.

పోలీస్‌స్టేషన్ ఆకస్మిక తనిఖీ

మైలవరం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మైలవరం పోలీస్‌స్టేషన్‌ను మంగళవారం జమ్మలమడుగు డీఎస్పీ వెంకటేశ్వరరావు ఆకస్మిక తనిఖీ చేశారు. స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించి కేసుల వివరాలను ఎస్ఐ శ్యాంసుందర్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా గట్టి చర్యలు తీసుకోవాలని డీఎస్పీ వెంకటేశ్వరరావు మైలవరం ఎస్ఐని ఆదేశించారు.

మినుము పంటకు పల్లాకు తెగులు

రాజుపాలెం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఖరీఫ్‌లో ప్రధాన పంట అయిన మినుము రైతులకు ఈ సంవత్సరం పూర్తిగా దిగుబడి తగ్గుతుందని రైతులు తెలిపారు. విత్తనం సమయంలో సకాలంలో వర్షాలు పడినా పూత దశలో వర్షం లేకపోవడంతో పాటు భూమిలో తేమ శాతం తగ్గడంతో పంటకు పల్లాకు తెగులు సోకింది. దీంతో 85 రోజులు ఉండాల్సిన పంట 60 రోజులకే పంట పూర్తిగా పల్లాకు తెగులుతో నిండిపోవడంతో పండినట్లు కనిపిస్తోంది. దీంతో రైతులు ఎకరాకు 3 నుంచి 4 క్వింటాళ్ల దిగుబడి కంటే ఎక్కువరాదని రైతులు తెలుపుతున్నారు. మండలంలో దాదాపు 2800 ఎకరాల్లో ఈ పంట సాగులో ఉంది. ఎకరాకు రూ. 30వేల నుంచి రూ.40వేలు ఖర్చులు వస్తాయని దిగుబడి మాత్రం 2, 3 క్వింటాళ్లు మాత్రమే వస్తుండడంతో ఎకరాకు రూ.20వేలు నష్టపోవాల్సి వస్తుందని రైతులు తెలిపారు. ఏది ఏమైనా మినుము రైతులు నష్టాలు ఎదుర్కోక తప్పలేదని అంటున్నారు.



పల్లాకు తెగులుతో మినుము పంట,చెట్టుకు పది కాయలతో ఉన్న దృశ్యం

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

ప్రొద్దుటూరు టౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని జేవీవీ రాష్ట్ర కార్యదర్శి తవ్వా సురేష్ పేర్కొన్నారు. డీవైఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. విజయం సాధించిన షిర్డిసాయి జూనియర్ కళాశాల టీంకు ట్రోఫీని అందజేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ గరిశపాటి లక్ష్మీదేవి, ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షురాలు ఉషారాణి, ప్రిన్సిపాల్ శివారెడ్డి, డీవైఎఫ్ఐ నాయకుడు శివ, వినయ్, తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహం ప్రహరీని పునర్నిర్మించాలి

ప్రొద్దుటూరు టౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): నడింపల్లె ప్రభుత్వ వసతి గృహం కాంపౌండ్‌ను పునర్నిర్మించాలని ప్రగతిశీల రెవెల్యూషనరీ విద్యార్థి యువజన సంఘం నాయకులు మంగళవారం డీఆర్వో విశ్వేశ్వరనాయుడుకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పీఆర్ఎస్‌వైఎఫ్ జిల్లా కన్వీనర్ నాగేంద్రబాబు , నాయకులు శ్రీనివాస్, నరసింహ, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఇందిరాగాంధీ జయంతి



ప్రొద్దుటూరులో నివాళులర్పిస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు టౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతిని కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. మంగళవారం వన్‌టౌన్ సర్కిల్‌లో ఉన్న ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీఎండీ నజీర్ మాట్లాడుతూ ఇందిరాగాంధీ దేశాభివృద్ధికి ఎంతగానో కృషి చేశారని పేర్కొన్నారు. పరిపాలన దక్షతతో ఉక్కు మహిళగా కీర్తిగడించారని తెలిపారు. బ్యాంకులను జాతీయం చేసి పేద ప్రజలకు అందుబాటులోకి తెచ్చారని, అలాగే పేదలకు పక్కా ఇళ్ల నిర్మాణం కార్యక్రమాన్ని ప్రారంభించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సుబాన్‌బాష, ఖాజాపీర్, తదితరులు పాల్గొన్నారు.

జమ్మలమడుగు..: జమ్మలమడుగు కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఇందిరాగాంధీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జమ్మలమడుగు నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు పాముల బ్రహ్మానందరెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు పి.రాజేష్, మండల అధ్యక్షుడు శివకుమార్‌రెడ్డి, మహేష్‌నాయుడు, రషీద్, మర్రి ప్రకాశం, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

చాపాడు..: చాపాడులోని గ్రంథాలయంలో మంగళవారం మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. లైబ్రేరియన్ శివశంకర్‌రెడ్డి, వెల్ఫేర్ అసిస్టెంట్ అశ్విన్, సీసీ సుబ్బరత్నమ్మ, గ్రామ సచివాలయ, ఉపాధి సిబ్బంది నివాళులర్పించారు.

ఖాజీపేట..: దేశాభివృద్ధికోసం కృషి చేసిన ఇందిరాగాంధీని ఆదర్శంగా తీసుకోవాలని జిల్లా ఎస్సీసెల్ మాజీ అధ్యక్షుడు వెంకటరమణ అన్నారు. మంగళవారం ఇందిరమ్మ జయంతిని పురస్కరించుకుని ఖాజీపేట బాలికల ఉన్నత పాఠశాలలో చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో నాగస్వర్ణలత, హెచ్ఎం, విద్యార్థులు పాల్గొన్నారు.

పంటలకు రసాయనాలను అధికంగా వాడవద్దు



చాపాడులో వేరుశనగ పైరును పరిశీలిస్తున్న శాస్త్రవేత్త వీరయ్య, రైతులు

ప్రొద్దుటూరు రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పంట సాగులో మితిమీరి రసాయనాలను అధికంగా వాడవద్దని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకుడు సురేష్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని సోములవారిపల్లెలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏవో శివశంకర్‌రెడ్డి , కేవీకే విజ్ఞాన కేంద్రం పశుశాస్త్రవేత్త సురేష్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముద్దనూరు..: మండల పరిధి పెనికెలపాడు గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. అందులో భాగంగా ఏవో వెంకటకృష్ణారెడ్డి కంది ,మినుము పంటలను పరిశీలించారు.రైతులకు తగు సూచనలు చేశారు. కంది పంట మొగ్గ, పూత దశలో ఉందని రసం పీల్చే పురుగు, లద్దెపురుగు నివారణకు సస్య రక్షణ చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో వీఏఏ పవన్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

చాపాడు..: రైతులు అధిక దిగుబడినిచ్చే వేరుశనగ పైర్లను సాగు చేసి లాభం పొందాలని కడప ఊటుకూరు వ్యవసాయశాస్త్రవేత్త వీరయ్య అన్నారు. వి.రాజుపాళెం గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. రాజుపాళెం, తిప్పిరెడ్డిపల్లె, నరహరిపురం, వెదురూరు గ్రామాల రైతులు ఎక్కువగా వేరుశనగ సాగు చేశారు. రైతులు సాగు చేసిన వేరుశనగ పైరును వారు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏవో మ్యాగీ, వీఏ జరిష, రైతులు పాల్గొన్నారు.

దువ్వూరు..: మండలంలోని కానగూడూరు గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వరి, జొన్న, మొక్కజొన్న పంటల సాగు, వాటి సస్యరక్షణ చర్యలపై ఏవో అమర్‌నాథ్‌రెడ్డి రైతులకు పలు సూచనలు చేశారు.

ఘనంగా మృత్యుంజయ హోమం

ప్రొద్దుటూరు టౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక అగస్త్యేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం ఆరుద్ర నక్షత్రం సందర్భంగా ఘనంగా మృత్యుంజయ హోమం నిర్వహించారు. ఉదయం అగస్త్యేశ్వరస్వామికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, రాజరాజేశ్వరిదేవి అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. గోపూజ లో కకల్యాణార్థం గణపతి, నవగ్రహ, ఉపదేవతాహోమాలు, మృత్యుంజయ హోమం శాస్త్రోక్తంగా నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి, ఈవో రామచంద్రాచార్యులు, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

శ్మశానాలకు ప్రహరీలను నిర్మించాలి

● ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్

మైదుకూరు రూరల్,నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : శ్మశానాలకు ప్రహరీలను నిర్మించాలని మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ అసెంబ్లీ సమావేశంలో మాట్లాడారు. విజయవాడలో అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ ప్రజా సమస్యలపై రోజు మాట్లాడుతూనే ఉన్నారు.అందులో భాగంగా మంగళవారం నియోజకవర్గంలో గత వైసీపీ ప్రభుత్వంలో అక్రమార్కులు శ్మశానాల కూడా వదలకుండా ఆక్రమించేశారని వాటిని వెంటనే రీసర్వే చేయించి ప్రహరీలను నిర్మించాలని ఆయన ముఖ్యమంత్రిని కోరారు. మొన్న భూఆక్రమణలు, నిన్న కుందూనదిపై రాజోలి జలాశయం అంశాలపై పుట్టా అసెంబ్లీలో మాట్లాడారు.

నేలవాలిన వరి పొలాల పరిశీలన

జమ్మలమడుగు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు మండలంలో ఖరీఫ్ సీజన్‌లో రైతులు సాగు చేసిన వరి పొలాలు నేలవాలాయి. అకాల వర్షంతో రైతులు ఆరుగాలం కష్టపడి అప్పులు చేసి సాగు చేసిన పంట చేతికొచ్చే సమయంలో నేలవాలింది. రెండు మూడు రోజుల క్రితం కురిసిన వర్షాలకు వరి పంట నేలవాలింది. కొన్ని చోట్ల వర్షపునీటికి తడిసి ధాన్యం మొలకలు వచ్చే ప్రమాదం ఉంది. దానవులపాడు, దేవగుడి, ధర్మాపురం, గొరిగెనూరు తదితర గ్రామాల రైతులు సాగు చేసిన వరి పంట పొలాలను ఏవో చంద్రశేఖర్‌రెడ్డి పరిశీలించి రైతులకు సూచనలు ఇచ్చారు. తడిసిన ధాన్యంపైన ఉప్పునీటిని చల్లాలని, నేలవాలిన వరిపైరును కట్టలుగా కట్టాలన్నారు. ఇప్పటి వరకు ఆరు గ్రామాల్లో 24 మంది రైతుల పొలాల్లో పరిశీలించి 450 ఎకరాల్లో పంట నష్టానికి సంబంధించి నివేదిక ఉన్నతాధికారులకు పంపినట్లు ఆయన తెలిపారు.

బి.కోడూరు..: మండల పరిధిలోని గుంతపల్లె, బీకోడూరు గ్రామాల్లో వర్షం ధాటికి నేలకొరిగిన వరి పంటలను మంగళవారం ఏవో కౌశిక పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో ఆమె మాట్లాడుతూ 50 గ్రాముల ఉప్పును ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసుకోవడం మొలకలు రాకుండా కాపాడుకోవచ్చని తెలిపారు. అలాగే పెద్దుళ్లపల్లె, పాయలకుంట్ల గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. డీఆర్‌సీ ఏవో శైలజ, వీఏఏలు గోవర్ధనరెడ్డి, చెన్నక్రిష్ణారెడ్డి, రైతులు పాల్గొన్నారు.





జమ్మలమడుగులో నేలవాలిన వరి పొలాలను పరిశీలిస్తున్న ఏవో చంద్రశేఖర్‌రెడ్డి, రైతులు, బీకోడూరులో వర్షానికి దెబ్బతిన్న వరి పంటను పరిశీలిస్తున్న ఏవో కౌశిక

ఆంధ్రజ్యోతి దినపత్రికలో...

ప్రారంభోత్సవం
జన్మదిన శుభాకాంక్షలు
ప్రమాణస్వీకారం
వివాహ మహోత్సవం
ఉద్యోగ విరమణ
విదేశీయానం
స్వదేశాగమనం

ఇప్పుడు ఆంధ్రజ్యోతి దినపత్రిక ద్వారా మీ ఆత్మీయులకు ప్రకటనలతో మరింత చేరువకండి, అందుకు మీ ప్రాంతంలోనే మా ప్రకటనల ప్రతినిధి అందుబాటులో ఉన్నారు సంప్రదించండి.

పొలిటికల్ యాడ్స్
షష్టిపూర్తి మహోత్సవం
సినిమా యాడ్స్
శ్రద్ధాంజలి
లీగల్ యాడ్స్
ప్రభుత్వ ప్రకటనలు
క్లాసిఫైడ్స్

యూనిట్ కార్యాలయం
సర్వే నెం. 137 & 138/3, చిన్నమాచుపల్లె చెన్నూరు మండలం, కడప.
Cell: 9985411183, 9985411193, 9985411189.

ప్రాంతీయ కార్యాలయాలు :
కడప: Cell : 99854 11192, 99854 10691, 99854 02134
కమలాపురం : 9985411183 ప్రొద్దుటూరు : 9985921354, పులివెందుల : 9985411183
జమ్మలమడుగు : 9985401296 మైదుకూరు : 7989603861 రాజంపేట : 9985411193
రాయచోటి: 9985411193 బద్వేలు: 9985921375 కోడూరు : 9985411193

ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు, పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.

ప్రొద్దుటూరు - A.C.O.: 99854 11466
జమ్మలమడుగు - S.R.: 94404 72816
మైదుకూరు - S.R.: 91334 42886
బద్వేల్ - S.R.: 99666 83437
A.C.M. : 99854 11184